www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
20-07-2024

సంపుటి : 01 | సంచిక : 77 | పేజీలు : 12 | వెల : 5/-    తెలంగాణ / ఆంధ్రప్రదేశ్







# కేసీఆర్ కారు స్టీరింగ్ వదిలేసినట్లేనా?

## బీఆర్ఎస్ పగ్గాలు తనయుడికి అప్పగిస్తారా?

### జనంలోకి రాని గులాబీ దళపతి

### అన్నీ తానై నడిపిస్తోన్న కేటీఆర్

### పార్టీ భవిష్యత్ తేల్చనున్న బడ్జెట్ సమావేశాలు




**విశ్వంభర, హైదరాబాద్ :**

కారుకు ఓనర్ కేసీఆరే అయినా స్టీరింగ్ కేటీఆర్ చేతుల్లోనే ఉందనేది జగమెరిగిన సత్యం. కారు పార్టీకి కేసీఆర్ అధినేత అయితే కొడుకు కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాత్రమే అని అందరికీ తెలుసు. ఇప్పుడీ చర్చంతా ఏ విషయంలో అంటే ఈనెల 23వ తేదీనుండి బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరగబోయే మూడో సమావేశాలు. మొదటి రెండు సమావేశాలకు కేసీఆర్ హాజరుకాలేదు. ఎన్నికల్లో ఓడిపోయిన వెంటనే కేసీఆర్‌కు ప్రమాదం జరిగి కాలి తుంటిఎముక విరిగింది. దానికి ఆపరేషన్ చేయించుకుని కేసీఆర్ ఇంటికే పరిమితమైపోయారు.

**కేసీఆర్ ఖచ్చితంగా రావాల్సిన సమయం..**

ఇక రెండో సమావేశం జరిగినా కేసీయార్ హాజరు కాలేదు. అందుకనే మూడోది బడ్జెట్ సమావేశాలకైనా హాజరవుతారా

మిగతా2లో...

ఇటీవల వరుసగా జరుగుతున్న సంఘటనలు చూస్తే ఇకపై గులాబీ దళపతి కేసీఆర్ ఇక బీఆర్ఎస్ పార్టీ పగ్గాలను వదిలేశాలా ఉన్నారు. కవిత అరెస్ట్, ఎన్నికల్లో ఓటమి, కాళేశ్వరం అవినీతి, విద్యుత్ కుంభకోణం, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులు, అధికార పక్షం విమర్శలు ఇలా ఏ అంశంపైనా కేసీఆర్ స్పందించడం లేదు. అన్నిటికీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రమే స్పందిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ కారు స్టీరింగ్‌ను వదిలి తన కుమారుడికే అప్పగిస్తారనే ప్రచారం బీఆర్ఎస్ శ్రేణుల్లో జరుగుతోంది.

# ప్రీ స్కూల్స్‌గా అంగన్‌వాడీలు



### తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ

- బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు పెట్టే యోచన
- 17 కోర్సులు, ఏటా 20 వేల మందికి శిక్షణ
- ప్రైవేటు కంపెనీల భాగస్వామ్యంతో నిర్వహణ
- హైదరాబాద్‌లోనే హెడాఫీస్.. మెయిన్ క్యాంపస్

## 4 నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ స్కూళ్లు

- విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాం
- త్వరలో విద్యా కమిషన్ ఏర్పాటు చేస్తాం
- మార్పులకు విధాన పత్రం రూపొందించండి
- యూనివర్సిటీ వీసీలు, బోధన, బోధనేతర సిబ్బందిని నియమిస్తాం
- విద్యావేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మెరుగుపర్చడానికి త్వరలోనే విద్యా కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు నాణ్యమైన విద్య బోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు తమ ప్రభుత్వ కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతంపై చర్చించేందుకు విద్యావేత్తలతో సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు.

మిగతా2లో...

## మైక్రోసాఫ్ట్ సేవలకు అంతరాయం

- ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకులు, విమానయాన, టెలీకాం రంగాలపై తీవ్ర ప్రభావం
- శంషాబాద్‌లో నిలిచిపోయిన 35 విమాన సర్వీసులు
- ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్ జెట్ విమాన సంస్థల సేవలు

9

## నీతి ఆయోగ్ నివేదికపై కేటీఆర్ హర్షం

- కేసీఆర్ కృషి ఫలితమే అంటూ కితాబు
- సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ లెక్కలే నిదర్శనం

2








## తెలంగాణ గ్రూప్-2 పరీక్షలు వాయిదా

- ఆగస్ట్ 7, 8 తేదీల్లో జరగాల్సిన పరీక్షలు
- డిసెంబర్ వరకు వాయిదా వేసిన సర్కార్
- గ్రూప్-3 పరీక్షలు సైతం వాయిదా
- ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో గ్రూప్ 2 పరీక్షలు వాయిదా పడ్డాయి. అభ్యర్థుల నిరసనలతో

మిగతా3లో...

## రుణమాఫీతో బీఆర్ఎస్, బీజేపీ నేతలకు నిద్రపట్టడం లేదు

- పదేళ్లలో కేసీఆర్ రూ.7లక్షల కోట్లు అప్పు
- అందులో అప్పటి మంత్రి హరీష్ రావు భాగస్వామ్యం
- కేటీఆర్ ట్వీట్‌లు చేయడానికి మాత్రమే పనికొస్తారు
- చిరంజీవి రైతులకు ఎందుకు మద్దతు ఇవ్వడం లేదు?
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

### నేడు మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ హ్యాకథాన్,

## క్రిటికల్ మినరల్ రోడ్ షో

- మైనింగ్ రంగంలో మరింత అభివృద్ధి సాధనే లక్ష్యం
- 29 ఫిబ్రవరి, 2024 నాటి క్రిటికల్ మినరల్ ఈ-ఆక్షన్ బిడ్డర్స్
- నేడు డీఎంఎఫ్ పోర్టల్‌ను ప్రారంభించనున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

2






## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 105 | ₹ 127 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 184 | ₹ 210 |

## త్వరలోనే కొత్త రేషన్ కార్డుల జారీ

- ఆరోగ్య శ్రీ కార్డులు సైతం విడుదల
- మంత్రివర్గంలో కొత్త కార్డుల మార్గదర్శకాలపై చర్చ
- ప్రకటించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

3





## ఆగస్టు 3న అమెరికాకు సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో విదేశీ పర్యటన ఖరారైంది. తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఈ ఏడాది జనవరిలో స్విట్జర్లాండ్, లండన్, దుబాయ్ దేశాల్లో పర్యటించిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన అమెరికా పర్యటన ఖరారైనట్లు సీఎంవో కార్యాలయం ప్రకటన జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 3వ తేదీన రాత్రి అమెరికా బయల్దేరనున్నట్లు ఈ ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం అమెరికా పర్యటన సాగనున్నట్లు తెలిసింది. అగ్రరాజ్యంలోని డల్లాస్ వంటి రాష్ట్రాల్లో ఈ బృందం పర్యటించనుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ అగ్రరాజ్యంలోని పలు కంపెనీల సీఈవోలు, పారిశ్రామికవేత్తలను కలవనున్నారు. వారితో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న పలు కంపెనీల గురించి వారికి చెప్పి, ఇన్వెస్ట్ మెంట్ కు తెలంగాణ రాష్ట్రం, ముఖ్యంగా హైదరాబాద్ మహానగరం ఎంతటి భద్రమైన, అనువైన ప్రాంతమో వివరించనున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణకు మరిన్ని పెట్టుబడులను ఆహ్వానించి పలు కంపెనీలతో ఒప్పందాలు చేసుకోనున్నారు. దాదాపుగా ఎనిమిది రోజుల పాటు అగ్రరాజ్యంలో పర్యటించనున్న రేవంత్ రెడ్డి బృందం తిరిగి ఆగస్టు 11వ తేదీన హైదరాబాద్‌కు చేరుకోనుంది. ఈ పర్యటనలో గతం కంటే ఎక్కువ పెట్టుబడులు ఆకర్షించాలని సీఎం టీమ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

## నేడు మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్ రోడ్ షో

**విశ్వంభర, హైదరాబాద్:** ఖనిజ వనరులను సద్వినియోగం చేసుకునేందుకు సృజనాత్మక విధానంలో ముందుకెళ్లడం, అంతర్జాతీయంగా అమలవుతున్న ఉత్తమ పద్ధతులను అలవర్చుకోవడం తదితర అంశాల ద్వారా మైనింగ్ రంగంలో మరింత అభివృద్ధి సాధించే లక్ష్యంతో కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ లోని బేగంపేటలో మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్ రోడ్‌షో జరగనుంది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఒన్నొవేటివ్ మినరల్ హంట్ టెక్నిక్స్ ను తెలుసుకోవడం, అందుబాటులో ఉన్న జియో ఫిజికల్ డేటా ఆధారంగా మైనింగ్ పై మరింత అవగాహన పెంచుకోవడం, మైనింగ్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మషీన్ లర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికత వినియోగం అంశాల వినియోగం తదితర అంశాలపై ఈ హ్యాకథాన్, రోడ్ షోల్లో వివరించనున్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా కేంద్రమంత్రి .. నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్) పోర్టల్ ను ప్రారంభిస్తారు. దేశవ్యాప్తంగా డీఎంఎఫ్ కు సంబంధించిన సంపూర్ణ సమాచారం ఈ వెబ్ సైట్లో అందుబాటులో ఉంటుంది. 29 ఫిబ్రవరి, 2024 నాడు క్రిటికల్ మినరల్స్ కు సంబంధించిన రెండో, మూడో విడత ఈఆక్షన్ జరిగింది. శనివారం నాటి కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి .. ఈ రెండు విడతల వేలంలో ప్రిఫర్డ్ బిడ్డర్స్ పేర్లను వెల్లడిస్తారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబేతోపాటు తెలంగాణ రాష్ట్ర ఉన్నతాధికారులు, కేంద్ర ప్రభుత్వ గనుల శాఖ ఉన్నతాధికారులు.. మైనింగ్ రంగానికి సంబంధించిన ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నారు.

## నీతి ఆయోగ్ నివేదికపై కేటీఆర్ హర్షం



**విశ్వంభర, హైదరాబాద్:** కేసీఆర్ హయాంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధిలో పరుగులు పెట్టిందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇందుకు తాజాగా నీతి ఆయోగ్ విడుదల చేసిన సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ లెక్కలే నిదర్శనమని చెప్పారు. పదేళ్ల పాటు తెలంగాణలో పేదరిక నిర్మూలనతో పాటు సుస్థిరమైన అభివృద్ధి కోసం కేసీఆర్ చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. తెలంగాణ మోడల్ సాధించిన ఘన విజయాలను కేంద్ర సంస్థలు ఎన్నో సందర్భాల్లో ప్రశంసించిన విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. పేదరికలో నిర్మూలనలో తెలంగాణ దేశంలో రెండో స్థానంలో ఉందన్న నీతి ఆయోగ్ నివేదిక పై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. 202021తో పోలిస్తే 202324 లో నాటికి లో 74 స్కోర్‌తో తెలంగాణ ముందుందని చెప్పారు. అంతకుముదు 202021 తో పోల్చితే ఐదు పాయింట్లు మెరుగైందన్నారు. చాలా రంగాల్లో తెలంగాణ సాధించిన మార్కులు జాతీయ సగటును మించి ఉండటం గత పదేళ్ల అభివృద్ధికి నిదర్శనమన్నారు. తక్కువ ధరలో క్లీన్ ఎనర్జీని అందించటంలో తెలంగాణ 100/100 మార్కులు తెచ్చుకోవటం విశేషం. స్వచ్ఛమైన తాగునీటిని అందించడంలో 90/100 స్కోర్ చేసింది. అభివృద్ధి, ఆర్థిక వృద్ధిలోనూ 84/100 స్కోరు సాధించటం సంతోషాన్నిచ్చిందన్నారు.

# తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఈ బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థినీ విద్యార్థులకు నైపుణ్యాల శిక్షణను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించే సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు, నిర్వహణకు ఎంత ఖర్చు అయినా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.



**తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ**

స్కిల్ యూనివర్సిటీపై సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఢిల్లీ, హర్యానాలో ఉన్న స్కిల్ యూనివర్సిటీలను పరిశీలించి, తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర పరిశ్రమల విభాగం నమూనా ముసాయిదాను తయారు చేసింది. ఈ యూనివర్సిటీలో నిర్వహించే కోర్సులు, వాటి వ్యవధి, నిర్వహణకు అవసరమయ్యే మౌలిక వసతులు, నిర్వహణకు అవసరమయ్యే నిధులు, వివిధ కంపెనీల భాగస్వామ్యంపై పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ప్రదర్శించారు. కొత్త యూనివర్సిటీకి 'తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ' అని పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

**ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో స్కిల్స్ యూనివర్సిటీ**

ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో (పీపీపీ మోడల్లో) స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పుతారు. లాభాపేక్ష లేకుండా స్వయం ప్రతిపత్తి ఉండేలా దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మూడు నాలుగేండ్ల కాల వ్యవధి ఉండే డిగ్రీ కోర్సులతో పాటు ఏడాది డిప్లొమా, మూడు నుంచి నాలుగు నెలల వ్యవధి ఉండే సర్టిఫికెట్ కోర్సులు ఇందులో నిర్వహిస్తారు. తెలంగాణలో అభివృద్ధి చెందుతున్న వివిధ రంగాలు, పరిశ్రమల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ఎంపిక చేశారు. మొత్తం 17 ప్రాధాన్య రంగాలను గుర్తించారు. ఫార్మా, కన్స్ట్రక్షన్, బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్, ఈ కామర్స్ అండ్ లాజిస్టిక్స్, రిటైల్, యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ గేమింగ్ అండ్ కామిక్స్..తొలుత ఆరు రంగాల్లో ఉపాధి అవకాశాలున్న కోర్సులను ప్రవేశ పెడుతారు. ప్రతి కోర్సును సంబంధిత రంగంలో పేరొందిన ఒక కంపెనీ భాగస్వామ్యం ఉండేలా అనుసంధానం చేస్తారు. అందుకు సంబంధించి ప్రభుత్వం కంపెనీలతో ఎంవోయూ చేసుకుంటుంది. తొలి ఏడాది రెండు వేల మందితో ప్రారంభించి, క్రమంగా ఏడాదికి 20 వేల మందికి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు.

**శాటిలైట్ క్యాంపస్లు ఏర్పాటు**

హైదరాబాద్ లో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ క్యాంపస్ తో పాటు జిల్లా కేంద్రాల్లో ప్రాంతీయ ప్రాంగణాలు (శాటిలైట్ క్యాంపస్లు) ఏర్పాటు చేయాలనే చర్చ జరగింది. జిల్లా కేంద్రాల్లో శాటిలైట్ క్యాంపస్ లు ఏర్పాటు చేస్తే.. వాటిలో చేరే వారి సంఖ్య తక్కువగా ఉంటుందని, అందరూ హైదరాబాద్ క్యాంపస్ లో చేరేందుకు పోటీ పడుతారని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే హైదరాబాద్ లోనే అందరికీ శిక్షణను అందించేలా ఏర్పాట్లు చేయాలని, ఈఎస్సీతో పాటు న్యాక్ క్యాంపస్ ఉపయోగించుకోవాలని, అవసరమైన మౌలిక వసతి సదుపాయాలుండే వివిధ ప్రాంగణాలను గుర్తించాలని సూచించారు. భూదాన్ పోచంపల్లిలో ఉన్న స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ లో ఉన్న సదుపాయాలను అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించాలని సీఎం ఆదేశించారు.

**ఫార్మా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు**

డిమాండ్ ఎక్కువగా ఉన్న రంగాలపైనే ఎక్కువ దృష్టి పెట్టాలని, రాష్ట్రంలో ఫార్మా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నందున, అటువంటి కోర్సుల్లో ఎక్కువ సీట్లు ఉండాలని చెప్పారు. ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు ఉండాలని, ఇందుకు సంబంధించి ముందుగానే వివిధ కంపెనీలతో చర్చించాలని సీఎం అధికారులను ఆదేశించారు. మిగతా యూనివర్సిటీలు అనుసరించిన విధానాలను పరిశీలించి కొత్త యూనివర్సిటీ సంస్థాగత నిర్మాణాన్ని తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పలు మార్పులు చేర్పులు చేసి ముసాయిదాను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రీ స్కూల్స్‌గా అంగన్‌వాడీలు

(మొదటి పేజీ తరువాయి)

విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా 11 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేయడం, టెట్ నిర్వహణ, ఏడాదికి రెండు సార్లు టెట్ నిర్వహించాలని నిర్ణయించడం, పాఠశాలలు తెరిచిన రోజే పిల్లలందరికీ యూనిఫాంలు, పాఠ్య పుస్తకాల అందజేత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన చేపట్టిన విధానాన్ని ముఖ్యమంత్రి తెలియజేశారు.



**విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు**

ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ బలోపేతానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, విద్యావేత్తలు ఇచ్చే మంచి సూచనలు స్వీకరిస్తామని తెలియజేశారు. భేటీలో పాల్గొన్న ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరాం, పి.ఎల్.విశ్వేశ్వరరావు, శాంతా సిన్హా, ఆల్దాస్ జానయ్య, పద్మజా షా, లక్ష్మీనారాయణ, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి విద్యా వ్యవస్థ బలోపేతానికి పలు సూచనలు చేయడంతో పాటు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలకు బోధించే నైపుణ్యం ఉండడం లేదని, సరైన వసతులు లేవని ప్రొఫెసర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటిని ప్రీ స్కూల్స్‌గా మార్చి వాలంటీర్లను తీసుకొని వారికి శిక్షణ ఇచ్చి పూర్వ ప్రాథమిక విద్యకు అవసరమైన శిక్షణ ఇచ్చేలా తీర్చిదిద్దాలనే యోచన చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మూడో తరగతి వరకు ప్రీస్కూల్‌లో బోధన అందేలా చూసి, నాలుగు నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆయా స్కూళ్లకు వెళ్లేందుకు విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయం యోచన తమకు ఉందన్నారు.

**దిగజారిపోయిన విద్యా శాఖ బడ్జెట్**

ఉమ్మడి రాష్ట్రంలో 11 శాతంగా ఉన్న విద్యా శాఖ బడ్జెట్ తెలంగాణ ఏర్పడిన తర్వాత 6.4 శాతానికి పడిపోయిందని, విద్యా వ్యవస్థ బలోపేతానికి బడ్జెట్ పెంపు అవసరమని ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. తాను, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇద్దరం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నామని, కచ్చితంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి బడ్జెట్ పెంచుతామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తేవాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, బడ్జెట్ కేటాయింపులు తప్పకుండా పెంచుతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. భేటీలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు.

**యూనివర్సిటీలపై ఫుల్ ఫోకస్**

పదేళ్లుగా యూనివర్సిటీల్లో బోధన సిబ్బంది నియామకం జరగలేదని, వీసీలు లేరని ప్రొఫెసర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీసీల నియామకానికి ఇప్పటికే సెర్చ్ కమిటీలు వేశామని, త్వరలోనే వీసీల నియామకం పూర్తవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. యూనివర్సిటీలకు డెవలప్‌మెంట్ గ్రాంట్స్ ఇవ్వాలని, ప్రతి యూనివర్సిటీలో వివిధ అంశాలపై లోతైన చర్చ, వాస్తవాల వెల్లడికి అభివృద్ధి చరిత్రకు సంబంధించిన అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. విద్యా సూచికలో తెలంగాణ అట్టడుగున ఉందని, తామంతా ఉస్మానియా విశ్వ విద్యాలయంలోనే చదువుకున్నామని, ప్రపంచ దేశాలన్నీ తిరిగి వచ్చామని, ప్రస్తుతం ఓయూలోనూ విద్యా ప్రమాణాలు పడిపోయాయని ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ శాంతా సిన్హా ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి తాము ఇప్పటికే మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యా వ్యవస్థలో తీసుకురావల్సిన మార్పులపై విధాన పత్రం రూపొందిస్తే.. దానిపై చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి అన్నారు. ఆయా అంశాలపై క్యాబినెట్ సబ్ కమిటీతోనూ చర్చించాలని వారికి సూచించారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రపంచ బ్యాంకు, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు అతి తక్కువ వడ్డీకి, దీర్ఘకాల రుణాలు ఇస్తాయని, ఇప్పటికే పలు రాష్ట్రాలు వాటి సాధనకు ప్రయత్నిస్తున్నాయని ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఆ అంశాన్ని పరిశీలిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

## కేసీఆర్ కారు స్టీరింగ్ వదిలేసినట్లేనా ?

(మొదటి పేజీ తరువాయి)

అన్న సందేహాలు పెరిగిపోతున్నాయి. అయితే పార్టీవర్గాల సమాచారం ఏమిటంటే బడ్జెట్ సమావేశాలు కాబట్టి కేసీఆర్ తప్పకుండా హాజరవుతారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన విధానంపై ఆదివారం పార్టీ ఎమ్మెల్యేలతో కేసీఆర్ భేటీ అయ్యే అవకాశాలున్నట్లు సమాచారం. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరఫున 38 మంది ఎమ్మెల్యేలు ఎన్నికైనా ఇప్పుడు ఉన్నది 28 మంది మాత్రమే. పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు. దీంతో బీఆర్ఎస్ బలం అసెంబ్లీలో బాగా క్షీణించిపోతోంది. బీఆర్ఎస్ లో నుండి కాంగ్రెస్ లోకి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫిరాయింపులు జోరందుకుంటున్న సమయంలోనే బడ్జెట్ సమావేశాలు మొదలవ్వబోతున్నాయి. ఈ క్రమంలో కేసీఆర్ తప్పకుండా సమావేశాలకు హాజరై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పులను ఎండగడతారని కారుపార్టీ నేతలు అంటున్నారు.

**ఫిరాయింపులపై ప్రశ్నించే సాహసం చేస్తారా..?**

అయితే అధికారంలో ఉన్నపుడు కేసీఆర్ ఏదైతే చేశారో ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే చేస్తున్నారు. ఈ క్రమంలో ఫిరాయింపులపై కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో పెట్టాలని ప్రయత్నిస్తే చివరకు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులే ఇరకాటంలో పడే ప్రమాదముంది. ఇంతచిన్న విషయం తెలీకుండానే సభలో ఫిరాయింపుల అంశాన్ని కేసీఆర్ లేవనెత్తుతారా అన్న సందేహం కూడా వినిపిస్తోంది. ఫిరాయింపుల అంశంపై కాంగ్రెస్ పార్టీ మీద కేసీఆర్ రాళ్లు వేస్తే వెంటనే కాంగ్రెస్ వైపునుండి కేసీఆర్ పైన పెద్ద బండరాళ్లే వచ్చిపడతాయనటంలో సందేహంలేదు. అందుకనే కేసీఆర్ ఫిరాయింపుల ప్రస్తావన తెచ్చే అవకాశాలు తక్కువే. మరి సభకు హాజరై కేసీఆర్ ప్రస్తావించబోయే అంశాలు ఏమిటనేవి ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. అనవసరంగా కాంగ్రెస్ పార్టీని ఇబ్బందుల్లో పెట్టబోయి తానే ఇబ్బందుల్లో పడటం దేనికి అనుకుంటే ఈ సమావేశాలకు కూడా కేసీఆర్ హాజరయ్యేది అనుమానమే.

**కేసీఆర్ కర్తవ్యం ఏంటీ..?**

కేసీఆర్ ఇలాగే ఆలోచిస్తే కారు స్టీరింగ్ పర్మినెంటుగా కేటీఆర్ చేతికి వచ్చేసినట్లే అనుకోవాలి. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనధికారికంగా పార్టీకి ప్రెసిడెంట్ అయిపోతే అధ్యక్షుడు కేసీఆర్ కాస్త చివరకు పార్టీకి గౌరవాధ్యక్షుడిగా మిగిలిపోతారేమో. ఎందుకంటే పార్టీ కార్యక్రమాలను నిర్వహించకుండా, అసెంబ్లీకి రాకుండా, పార్టీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్ళకుండా కేసీఆర్ ఏమిచేస్తారు ? ఇపుడు పార్టీలో కేటీఆర్, హరీష్ రావు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారు. పార్టీ ఫిరాయిస్తారు అనే అనుమానం ఉన్న ప్రజా ప్రతినిధులతో నాలుగురోజులు కేసీఆర్ వరుసగా సమావేశాలు నిర్వహించారు. ఒకవైపు సమావేశాలు నిర్వహిస్తున్నా మరోవైపు పార్టీని వదిలేసే వాళ్ళు వదిలేస్తునే ఉన్నారు. అందుకనే సమావేశాలను కూడా ఆపేశారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ మళ్లీ కారు స్టీరింగ్ పట్టుకుంటారా ? అనే సందేహాలు పెరిగిపోతున్నాయి.

## ఇతర రాష్ట్రాల్లోనూ సీఎం రేవంత్‌రెడ్డి సేవలు : ఎంపీ మల్లు



**విశ్వంభర, నాంపల్లి:** రైతుల రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రైతు బాంధవుడిగా కాంగ్రెస్ ఎంపీలు కొనియాడారు. గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్ రామసహాయం రఘురాంరెడ్డిలు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఐదు గ్యారెంటీలను అమలు చేశామని తెలిపారు. గత ప్రభుత్వం రైతులను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. పది సంవత్సరాలు ప్రభుత్వంలో ఉన్న బీఆర్ఎస్ రైతులను మోసం చేసిందని తెలిపారు. గత ప్రభుత్వంలో కుటుంబ పాలన జరిగిందని విమర్శించారు. బీజేపీ గుజరాత్ మోడల్ అంటుందని దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా తెలంగాణలో రుణమాఫీ చేశారని తెలిపారు. భారత దేశంలో తెలంగాణ మోడల్‌గా చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్తామని మల్లు రవి వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి సేవలను ఇతర రాష్ట్రాల్లోనూ ఉపయోగించుకునేలా అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్తామని మల్లు రవి వెల్లడించారు.

# రుణమాఫీతో బీఆర్ఎస్, బీజేపీ నేతలకు నిద్రపట్టడం లేదు



**విశ్వంభర, నాంపల్లి:**

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేయడంతో బీఆర్ఎస్, బీజేపీ నేతలు షాక్‌లో ఉన్నారని వారికీ నిద్ర కూడా పట్టడం లేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో కేసీఆర్ రూ.7లక్షల కోట్లు అప్పు చేశారని, అందులో అప్పటి మంత్రి హరీష్ రావు భాగస్వామి కాదా అని ప్రశ్నించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 26 వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేసారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.31 వేల కోట్లు మాఫీ చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్‌లు చేయడానికి మాత్రమే పనికి వస్తారని సెటైర్ వేశారు. ఇక పదేండ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతుల కోసం ఎన్నివేల కోట్లు రుణమాఫీ చేసారో చెప్పాలని బీజేపీ కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలను ఆయన ప్రశ్నించారు. పదేళ్లలో కార్పొరేట్ వ్యక్తులకు 16 లక్షల కోట్లు మాఫీ చేసారని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం నల్ల చట్టాలకు తీసుకువచ్చి రైతుల నడ్డి విరిచారని ఫైర్ అయ్యారు.

**చిరంజీవిపై సంచలన వ్యాఖ్యలు చేసిన జగ్గారెడ్డి**

మెగాస్టార్ చిరంజీవిపై జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతులకు జరుగుతున్న నష్టాలపై సినిమాలు తీసిన చిరంజీవి... ఢిల్లీలో ధర్నాలు చేసిన రైతులకు ఎందుకు మద్దతు ఇవ్వలేదని ప్రశ్నించారు. సినిమాలతో కోట్లు సంపాదిస్తున్న మీరు రైతు సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని అడిగారు. రైతుల పేరుతో తీసిన సినిమాలతో డబ్బులు సంపాదిస్తూ... ప్రధాని మోదీకి మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. మోదీకి, పవన్ కు మాత్రమే ఎందుకు మద్దతిస్తున్నారని... రైతులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీకి ఎందుకు సపోర్ట్ చేయడం లేదని ప్రశ్నించారు.



# తెలంగాణ గ్రూప్-2 పరీక్షలు వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

దిగొచ్చిన ప్రభుత్వం ఆగస్ట్ 7, 8 తేదీల్లో జరగాల్సిన పరీక్షను డిసెంబర్‌కు వాయిదా వేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొత్త తేదీలని త్వరలోనే ప్రకటించనుంది. గ్రూప్ 2లో 783 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా 5.51 లక్షల అభ్యర్థులు పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. గ్రూప్2 పరీక్షలే కాకుండా గ్రూప్3 పరీక్షల వాయిదాకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని ఎంపీ మల్లు రవి వెల్లడించారు. పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం త్వరలో తేదీలు ప్రకటిస్తుందని తెలిపారు. డిసెంబరులో గ్రూప్2 నిర్వహణకు ప్రభుత్వం అంగీకరించిందని అభ్యర్థులు చెప్పారు. గ్రూప్2 పోస్టుల పెంపుపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు.

## హైదరాబాద్ కేంద్రంగా ఆన్‌లైన్‌లో ప్రిపరేషన్..

"హైదరాబాద్ కేంద్రంగా ఆన్లైన్ లో పాఠాలు బోధిస్తారు.. ప్రిపేర్ అయ్యేవారు ఆయా కేంద్రాల నుంచి ఆన్లైన్లోనే ప్రశ్నలు వేయవచ్చు... అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారు ఇకనుంచి అశోక్ నగర్ లో ఐదు రూపాయల భోజనంతో ఇబ్బంది పడాల్సిన పనిలేదు. నిరుద్యోగులు చెప్పిన ప్రతి అంశాన్ని సీరియస్ గా పరిశీలిస్తాం, మీరు మా బిడ్డలు.. రాష్ట్ర సంపద.. మీ మేధస్సు నిలువు ఉపయోగం కావద్దనేదే ప్రభుత్వం ఆలోచన... ఇందిరమ్మ ప్రభుత్వం నూటికి నూరు శాతం మీ సమస్యలు వింటుంది పరిష్కరిస్తుంది. ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యం చేస్తే ప్రభుత్వానికే జీతాల భారం తగ్గుతుంది.. కానీ మేము అలా ఆలోచించడం లేదు. మా బిడ్డలు స్థిరపడాలి వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని మనసారా కోరుకుంటున్నాం. విద్యా వ్యవస్థను సమూలంగా మార్చాలని వడివడిగా అడుగులు వేస్తున్నాం. గ్రూప్ 2 అభ్యర్థులతో మాట్లాడి సమస్య పరిష్కరించాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్రం తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసం. బెదిరించి బ్లాక్ మెయిల్ చేసి.. కేసుల పాలైతే మీరే నష్టపోతారు.. కొందరు వారి లాభాల కోసం చేసే ప్రయత్నాల్లో మీరు ఇబ్బందులు పడవద్దు" అని భట్టి విక్రమార్క అభ్యర్థులకు సూచించారు.

**గ్రూప్ 2 అభ్యర్థులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్చలు**

కాగా, తెలంగాణ సచివాలయంలో శుక్రవారం గ్రూప్ 2 అభ్యర్థులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్చలు జరిపారు. చర్చల అనంతరం టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డికి భట్టి ఫోన్ చేశారు. డిసెంబరులో గ్రూప్2 పరీక్షల నిర్వహణ అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఓవర్ ల్యాపింగ్ లేకుండా పరీక్షలు నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం అభ్యర్థులకు చెప్పారు. త్వరలో ఉద్యోగ ఖాళీలపై జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. కొద్ది రోజుల్లోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికోసం అధునాతన టెక్నాలజీతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించబోతున్నామని భట్టి చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోటీ పరీక్షలకు ఉచితంగా ఆన్లైన్లో శిక్షణ ఇస్తామన్నారు. పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు దేశంలోనే ఉన్నతమైన సబ్జెక్టు నిపుణులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు.

**రాష్ట్రంలో మొత్తం దరఖాస్తుదారులు ఎంత మంది..?**

రాష్ట్రంలో మొత్తం 783 గ్రూప్ 2 పోస్టుల భర్తీకి ఆగస్టు 7, 8 తేదీల్లో పరీక్షలు నిర్వహించాలని మార్చి నెలలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్ణయించిన విషయం తెలిసిందే. గ్రూప్ 2 ఉద్యోగాలకు 5.51లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 1,388 గ్రూప్ 3 ఉద్యోగాల భర్తీకి రాత పరీక్షలు షెడ్యూల్ ప్రకారం నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించాల్సి ఉంది. అయితే, డీఎస్సీ, గ్రూప్ 2 పరీక్షల మధ్య వారం రోజుల మాత్రమే వ్యవధి ఉండటంతో వాయిదా వేయాలని అభ్యర్థులు కోరారు. వీరి అభ్యర్థనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. గ్రూప్ 2 పరీక్షలు వాయిదా వేసేందుకు నిర్ణయించింది. దీనితో పాటు గ్రూప్ 3 పరీక్షలు కూడా వాయిదా వేయడానికి ప్రభుత్వం అంగీకరించినట్లు ఎంపీ మల్లు రవి తెలిపారు. చర్చల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, గ్రూప్2 అభ్యర్థులు పాల్గొన్నారు.

**చర్చలు సఫలమైనట్లేనా?**

గత కొన్నిరోజులుగా తెలంగాణలో నిరుద్యోగులు ఆందోళనలు చేస్తున్నారు. గ్రూప్స్, డీఎస్సీ పోస్టులు పెంచడంతోపాటు ప్రిపరేషన్ కి ఎక్కువ సమయం లేనందున వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు. జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటించాలని కోరుతున్నారు. ఇటీవల యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్ తెస్తామని సీఎం హామీ ఇచ్చారు. కాగా, నిన్న బేగంపేట టూరిజం ప్లాజాలో కాంగ్రెస్ నేతలు నిరుద్యోగులతో భేటీ అయ్యారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, బల్మూర్ వెంకట్ వారితో చర్చలు జరిపారు. భేటీ అనంతరం ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ.. నిరుద్యోగులు చెప్పిన సమస్యలు విన్నాము.. వారి సమస్యలని పరిష్కరించే విధంగా సీఎం దృష్టికి తీసుకుని వెళ్తాము అన్నారు. నిరుద్యోగులు కోరుకునే విధంగా సానుకూలమైన ప్రకటన వచ్చే విధంగా కృషి చేస్తాము.. ముఖ్యంగా డీఎస్సీ, గ్రూప్ 2 పరీక్షకి మధ్య తక్కువ వ్యవధి ఉంది.. ఇది కూడా ఉదేశపూర్వకంగా ఇచ్చిన డేట్స్ కాదు. గతంలో డీఎస్సీ పరీక్షలు మే జూన్ నెలలో ఉండే .. అయితే అ రోజు యువకులు మరొకసారి డీఎస్సీ కంటే ముందు టెట్ నిర్వహించాలని కోరారు. నిరుద్యోగుల కోరిక మేరకే అ రోజు టెట్ నిర్వహించాము.. అయితే అప్పటికే టీజీపీఎస్సీ పరీక్షలకు డేట్స్ ఇవ్వడంతో డీఎస్సీ, గ్రూప్ 2 పరీక్షలు వారం వ్యవధిలోనే వచ్చాయి. ఇది న్యాయమైన డిమాండ్ కాబట్టి.. నేను ఎంపీ వారి సమస్యను విన్నాము సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పాము.. గ్రూప్ 2 పరీక్షల పై ఇక సానుకూలమైన ప్రకటన వచ్చేలా చూస్తాము. ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఖాళీని భర్తీ చేసి నిరుద్యోగుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని చాటుకుంటాము.. ఈసారి అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాము" అని బల్మూర్ వెంకట్ హామీ ఇచ్చారు. అభ్యర్థుల డిమాండ్స్ పై సానుకూలంగా స్పందించిన సర్కార్ గ్రూప్ 2 పరీక్షలు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# త్వరలోనే కొత్త రేషన్ కార్డుల జారీ

- ఆరోగ్య శ్రీ కార్డులు సైతం విడుదల
- మంత్రివర్గంలో కొత్త కార్డులపై మార్గదర్శకాలపై చర్చ
- ప్రకటించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం చాలా కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి.. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు అర్హత ఉండటంతో.. అవి లేకపోవడం వల్ల నిరుపేద కుటుంబాలకు పెద్ద ఆటంకంగా మారింది. దీంతో కొత్త రేషన్ కార్డుల కోసం చాలా కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి.. ఈ క్రమంలో తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీపై మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని తెలిపారు. రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు వేర్వేరుగా ఇస్తామని తెలిపారు. మంత్రివర్గంలో కొత్త రేషన్ కార్డు మార్గదర్శకాలపై చర్చిస్తామన్నారు. కొత్త రేషన్ కార్డులు ఎవరెవరికీ ఇవ్వాలన్నదానిపై చర్చించి.. మార్గదర్శకాలు ఖరారైన వెంటనే ప్రక్రియ ప్రారంభిస్తామని ఉత్తమ్ తెలిపారు. రేషన్ కార్డు వేరేగా.. ఆరోగ్యశ్రీ కార్డు వేరేగా ఇవ్వనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు రేషన్ కోసం.. ఆరోగ్యశ్రీ వైద్యం కోసం అని తెలిపారు. వాస్తవానికి చాలా కాలం నుంచి కొత్త రేషన్ కార్డులు అందించలేదు.. దీంతోపాటు కార్డుల్లో మార్పులు చేర్పులు ప్రక్రియ కూడా జరగలేదు.. దాదాపు ఏడెనిమిది సంవత్సరాల నుంచి జనం రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీకి హామీ ఇచ్చినప్పటికీ.. ఇంకా ప్రక్రియ మొదలు కాలేదు. ఈ క్రమంలోనే కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు.




# తలసాని ఆశలు గల్లంతు.. చెక్ పెట్టిన సీఎం రేవంత్

**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రయత్నాలకు చెక్ పెట్టారు సీఎం రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీలో చేరాలనే ఆలోచనలో ఉన్న తలసాని ...యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ ద్వారా రాయబారం నడిపారు. నేరుగా రాహుల్ గాంధీ ద్వారా కాంగ్రెస్లో చేరి మంత్రి పదవి కొట్టేద్దామనుకున్నారు. అయితే తలసాని ప్రయత్నాలకు బ్రేక్ వేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.ఓవైపు తెలంగాణ ప్రభుత్వం గొర్రెల పంపిణీ స్కామ్‌లో నిజానిజాలు తేల్చే ప్రయత్నం చేస్తుండగా అప్పట్లో పశుసంవర్ధక శాఖ మంత్రిగా పనిచేసిన తలసానిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడం సరికాదని రేవంత్ రెడ్డి...,రాహుల్ గాంధీకి క్లారిటీ ఇచ్చారట.దీంతో కాంగ్రెస్ పార్టీలో చేరాలన్న తలసాని ప్రయత్నాలకు మరోసారి బ్రేక్ పడిందని టాక్ నడుస్తోంది.



**తలసానితో పార్టీకి నష్టమే..**

బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు అందరూ వచ్చినా ఆహ్వానిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి...,తలసాని శ్రీనివాస్ యాదవ్ ను చేర్చుకునేందుకు ఆసక్తిగా లేరు. తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎంత ప్రయత్నించినా గాంధీ భవన్ తలుపులు మాత్రం తెరుచుకోవడంలేదు. తెలంగాణలో గొర్రెల పంపిణీ పథకంలో అవకతవకలు జరిగాయంటూ ఏసీబీ విచారణ చేస్తోంది. ఏసీబీ అధికారులు పలువురిని అరెస్ట్ కూడా చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ పశుసంవర్ధక శాఖ మంత్రిగా ఉన్నారు. గొర్రెల పంపిణీ స్కామ్‌లో తలసాని పాత్ర కూడా ఉందని, ఈ కేసులో ఆయన చుట్టూ ఉచ్చు బిగుస్తోందని వార్తలొచ్చాయి. ఈ కేసులో తలసాని అరెస్ట్ కూడా అవుతారని ప్రచారం కూడా జరిగింది. ఇలాంటి సమయంలో ఆయన్ని కాంగ్రెస్ లో చేర్చుకుంటే పార్టీకి నష్టమని రేవంత్ భావిస్తున్నారు.

**కొడుకు భవిష్యత్తు కోసం తలసాని ఆరాటం**

ఎన్ని అడ్డంకులు ఎదురైనా తలసాని మాత్రం తన ప్రయత్నాలను ఆపడం లేదని తెలిసింది. ఎలాగైనా కాంగ్రెస్ లో చేరాలన్న పట్టుదలతో ఉన్నారు. తలసాని కాంగ్రెస్‌లో చేరడం ద్వారా తన కొడుకు సాయి కిరణ్ రాజకీయ భవిష్యత్తుకు కూడా ఢోకా ఉండదని అతని ఆలోచన. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తన కొడుకుకు బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించినా దక్కలేదు. ఆ తర్వాత కంటోన్మెంట్ ఉపఎన్నిక సమయంలో కూడా తన కొడుకుని పోటీకి నిలబెట్టాలని ప్రయత్నించినా బీఆర్ఎస్ టికెట్ రాలేదు. ఇక అప్పటినుంచి ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ కాంగ్రెస్ లో చేరే ఆలోచనలో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్‌లో చేరితే తనతో పాటు తన కొడుకుకూ రాజకీయంగా కలిసొస్తుందని అనుకుంటున్నారు. మరి తలసాని ప్రయత్నాలు ఫలిస్తాయో లేదో చూడాలి.



# రేడియో ఆవిష్కర్త మార్కొనీ

**ప్రస్తుతం ప్రతి ఇంటిలో ఇప్పుడు టివి ఉన్నట్లే కొంత కాలం క్రితం ప్రతి ఇంటిలో రేడియో సెట్ ఉండేది. నాడు ప్రధాన మనో రంజన సాధనాల్లో రేడియో ప్రధాన మైనది. రేడియో పేరు తీయగానే గుర్తుకు వచ్చేది దాని ఆవిష్కర్త మార్కోనీయే. గుగ్లి ఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ (1874 ఏప్రిల్ 25 - 1937 జూలై 20) ఇటాలియన్ ఆవిష్కర్త, ఎలక్ట్రికల్ ఇంజనీర్. అతను సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపుటకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయుటలో పితా మహుడుగా గుర్తింపు పొందాడు. అతను రేడియో యొక్క ఆవిష్కర్త. 1909 లో కార్ల్ ఫెడ్రినాండ్ బ్రాన్ తో కలసి వైర్‌లెస్ టెలిగ్రాఫీ అనే అంశంపై భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి తీసుకున్నాడు. 1897 లో బ్రిటన్ లో వైర్‌లెస్ టెలిగ్రాఫ్, సిగ్నల్ కంపెనీకి వ్యవస్థాపకునిగా ఉన్నాడు. అతను ఇతర భౌతిక శాస్త్రవేత్తల ప్రయోగాలను ఆధారంగా చేసుకొని రేడియో అనే కొత్త ఆవిష్కరణ చేసి వ్యాపార రంగంలో ఘనమైన విజయాన్ని సాధించాడు.**



రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేష న్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రి యను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనా న్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి.

మార్కోని 1874 ఏప్రిల్ 25 లో ఇటలీ దేశంలోని బొలొగ్నాల్లో అన్నీ జేమ్సన్, గుసెప్ మార్కోనీ దంపతులకు జన్మించాడు. విద్యార్థి దశలో మార్కోనీ పరిశోధనల పట్ల మక్కువ చూ పించేవాడు. తన తల్లిదండ్రులచే నియమించబడిన ప్రైవేట్ ఉపాధ్యాయుల నుండి ఇంట్లో రసాయనశా స్త్రం, గణితం, భౌతిక శాస్త్రాలను నేర్చుకున్నాడు.

లివోర్నోలోని ఉన్నత పాఠశాల భౌతిక ఉపా ధ్యాయుడు ప్రొఫెసర్ విన్సెంజో రోసా 17 ఏళ్ల మార్కోనీకి భౌతిక దృగ్విషయాల ప్రాథమిక విష యాలను, అలాగే విద్యుత్తుపై కొత్త సిద్ధాంతాలను నేర్పించాడు.18 యేళ్ళ వయస్సులో అతను తిగిరి బోలోగ్నాకు తిరిగి వచ్చాడు.

1890 ల ప్రారంభంలో, అతను "వైర్‌లెస్ టెలి గ్రాఫీ" అనే ఆలోచనపై పనిచేయడం ప్రారంభిం చాడు, అంటే ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్ ఉపయోగించిన వైర్లను కనెక్ట్ చేయకుండా టెలిగ్రాఫ్ సందేశాలను ప్రసారం చేయడం.

బోలోనా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫె సర్ రీగ్ అధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు మార్కోనీ కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదం డ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. 1888 లో, విద్యుదయస్కాంత వికిరణాన్ని ఉత్పత్తి చేయగలవ చ్చునని, గుర్తించగలమని నిరూపించాడు.

ఒకరోజు అర్థరాత్రి సమయంలో తల్లిని నిద్ర లేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకెళ్ళాడు. ఒకచోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రి క్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట మోగడం ప్రారంభించింది. మధ్యలో తీగలు లేకపో యినా గంట మోగటం ఆశ్చర్య పరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది.

మార్కొనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవ లిపైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించానని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు.

క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరిం చేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యు డయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడాని కి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని బయలు దేరాడు. వార్తలను వైర్ లెస్ ద్వారా సముద్ర తీరానికి పంపితే, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయా నికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే.

వేల్స్ రాకుమారుడు ఒకసారి విహార నౌకలో వెడుతూ వైట్ దీవుల కావల జబ్బు పడ్డాడు. కుమారుని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసు కోవాలని విక్టోరియా రాణి సంకల్పిం చింది. వెంటనే మార్కోనీని అభ్యర్థించగా అతడు వైర్ లెస్ పరికరాలను నెలకొల్పి, 16 రోజుల పాటు నిర్విరామంగా వార్తలను చేరవేసే ఏర్పాటు చేశాడు. మొత్తం 150 టెలిగ్రాంలు అటూ, యిటూ ప్రసారం చేయబడ్డాయి. 1909 లో రెండు పడవలు సముద్ర మధ్యంలో ఢీ కొన్నాయి. వైర్ లెస్ ద్వారా తీరానికి సమాచారం వెంటనే అందించక పోయి ఉంటే 1700 మంది ప్రయాణీకులు మునిగిపో యే వారు. 1912 ఏప్రిల్ లో టైటానిక్ అనే ఓడ సముద్ర మధ్యంలో ఓ మంచు కొండను ఢీకొంది. ఓడ మునిగి పోతుండగా అక్కడి ఆపరేటర్ వైర్ లెస్ ద్వారా SOS సంకేతాలను అనేక సార్లు పంపించాడు. ఫలితంగా 700 మందిని రక్షించ టానికి వీలైంది. 1907 లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన ఓడలు ప్రపంచ పర్యటన చేస్తున్న సంద ర్భంగా జాతీయ గీతం వాద్యాలాపనను ఒక ఓడ నుండి మరో ఓడకి ప్రసారం చేసుకో గలిగారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు.

మార్కోనీ రేడియో ప్రసారానికి సంబంధించిన పరిశోధనల్ని అవిశ్రాంతంగా కొనసాగించాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్ర పంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం (broad casting station) పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నిక య్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించ టంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభ మైనాయి.

1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపిం చారు.1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సి స్టర్ 1948 లో తయారు చేసింది. బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది.

1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న ప్రారంభమైన బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభ మైంది. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తి లోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారం భించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494



## కోరికలపై నియంత్రణ అవసరము

మనలోని బలహీనతను, భయాన్ని దూరం చేసుకోలేకపోతే బతుకు దుర్భరంగా మారుతుంది. భయం భయంగా జీవించడం కన్నా పెద్ద కష్టం ఉండదు. ఏ పరిస్థితిలోనైనా మనిషి తనను తాను నిందించుకోకూడదు. పరనిందే కాదు, స్వీయనిందా ప్రమాదకరమే.

జీవిత కాలంలో తప్పులు చేయకుండా బతకడం కష్టం. మనం సామాన్య మానవులం. ఎల్లప్పుడు నిజమే పలకడానికి హరిశ్చంద్రులం కాము. శరీరం నుంచి మాంసాన్ని కోసిచ్చే శిబి చక్రవర్తులం అంతకంటే కాదు. కానీ ఆనందకరమైన నిర్భయమైన జీవితం కోసం తపించే అత్యంత సాధారణ మనుషులం.

మనం మన సాధారణత్వాన్ని అంగీకరించిన క్షణమే మన వ్యక్తిత్వం అసాధారణమవుతుంది. మన అజ్ఞానాన్ని అంగీకరించిన మరుక్షణమే మనలోకి తొలి వెలుగురేఖ ప్రవేశిస్తుంది.

మనసులో ఒకటి, బాహ్యంగా మరో భావనతో జీవించడం తగని పని. మనసులో ప్రతి మనిషికీ కొన్ని కోరికలు ఉంటాయి. అవి మంచి కోరికలా, చెడు కోరికలా అనేది విశ్లేషించుకోవాలి.

ఎదుటివాడి జేబులోని డబ్బు అయాచితంగా మనకు చేరాలని ఆశించడం చెడు కోరిక. ఏదైనా మంచిపని చేసి డబ్బు సంపాదించాలనుకోవడం మంచి కోరిక.

ఏదైనా... కోరికలపై నియంత్రణ ఉంటేనే జీవితం ఆనందంవైపు పయనించే అవకాశం ఉంటుంది.

# పర్వతారోహణ క్రీడకు పెరుగుతున్న ఆదరణ

**జూలై 20... ఎడ్మండ్ హిల్లరీ జయంతి**

8848 మీటర్ల ఎత్తుతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగల హిమాలయ పర్వతాలలోని ఎవరెస్టు శిఖరం అధిరోహణ అత్యంత సాహస మైన కృత్యం. టెన్సింగ్ నార్కేతో పాటు ఎడ్మండ్ హిల్లరీ 1953, మార్చి 29 నాడు ఈ శిఖరాన్ని చేరుకొని ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తులుగా నిలిచారు. మౌంట్ ఎవరెస్టు పర్వతాన్ని నేపాలీలు 'సగరమత' అని అలాగే టిబెటన్లు 'చోమోలున్ద మా' పర్వతమని పిలుస్తారు. 1830 43 శ్రీ మధ్య తొలిసారి సర్వే చేసిన భారత సర్వేయర్ జనరల్ 'సర్ జార్జ్ ఎవరెస్ట్' ఈ పర్వతాన్ని గుర్తించారు. ఆయన స్మారకార్థం ఈ పర్వతానికి 'ఎవరెస్ట్' అని నామకరణం చేశారు. సర్ ఎడ్మండ్ పర్సీవల్ హిల్లరీ (జూలై 20, 1919 - జనవరి 11, 2008) న్యూజిలాండ్కు చెందిన పర్వతారోహకుడు,అ న్వేషకుడు. ఎడ్మండ్ హిల్లరీ 1919 జూలై 20న న్యూజిలాండ్ లోని ఆక్లాండ్‌లో జన్మించాడు. 16 సంవత్సరాల వయస్సులోనే హిల్లరీ పర్వతారోహ ణపై మక్కువ చూపినాడు. 1939లో దక్షిణ ఆల్ప్స్ పర్వతాలలో ఉన్న ఆలివర్ పర్వత శిఖరాన్ని అధిరోహించడం అతని జీవితంలో తొలి ప్రధాన సాహస కృత్యం. ఎవరెస్ట్ అధిరోహణే కాకుండా హిమాలయ పర్వతాలలో ఉన్న ముఖ్యమైన మరో 10 శిఖరాలను కూడా హిల్లరీ అధిరోహించాడు. ఎడ్మండ్ హిల్లరీ నేపాలీల ముఖ్యంగా షెర్పాల దృష్టిలో దైవసమానుడు. ఎవరెస్టు అధిరోహణ సమయంలో అక్కడి షెర్పాల దయనీయ జీవి తాన్ని చూసి చలించి, అక్కడ పాఠశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేసి షెర్పాల జీవితంలో వెలుగులు నింపాడు.



ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి తమ దేశ గౌరవాన్ని నిలబెట్టినందుకు న్యూజీలాండ్ ప్రభు త్వం 5 డాలర్ల కరెన్సీ నోటుపై హిల్లరీ బొమ్మను ముద్రించి అతని ప్రతిభను గౌరవించింది. బ్రిటన్ జట్టులోని సభ్యుడిగా హిల్లరీ సాధించిన విజయా న్ని గౌరవిస్తూ బ్రిటన్ రాణి రెండో ఎలిజబెత్ హిల్ల రీని సత్కరించింది.

**పర్వతారోహణ సాహస క్రీడ ప్రమాదకరం:**

హిమాలయాల్లోని 'మహాలంగూర్ హిమల్' సబ్‌రేంజ్లో అత్యంత ఎత్తైన ఎవరెస్టు పర్వతం చైనా నేపాల్ సరిహద్దుల్లో ఉన్నది. ఎవరెస్ట్ పర్వతారోహ ణలో ప్రతికూల వాతావరణం, బలమైన గాలులు, అవలాంచ్ ప్రమాదాలు, అల్టిట్యూడ్ సిక్నెస్, మంచు చెరియలు విరిగి పడడం లాంటి ప్రాణాం తక ప్రమాదాలు ఉంటాయి. 2019 గణాంకాల ప్రకారం 306కు పైగా ఎవరెస్ట్ పర్వతారోహకు లు అధిరోహించాలనే ప్రయత్నాలలో ప్రాణాలు విడవడం, అలాంటి సాహసికుల పార్థివ దేహాలు ఆ మంచు కొండల్లోనే కలవడం జరిగింది. ఆక్సీ జన్ బాటిల్ వెంట ఉన్నప్పటికీ పర్వతారోహకు లు వాంతులు, అలసట, వికారం, హిమఘాతం (ఫ్రోస్నైట్), అల్పోష్ణస్థితి లాంటి పలు అనారోగ్యాల పాలు అవుతారు. పర్వతారోహణాన్ని పూర్తి చేసి దిగువకు వచ్చిన వారు పలు శారీరక, మానసిక బలహీనతలతో బాధ పడడం సాధారణంగా జరుగుతుంది.

**పర్వతారోహణకు పెరిగిన ఆసక్తి:**


4,042 మంది పర్వతారోహకులు ఎవరె స్టు అధిరోహించగా, అందులో 635 మంది మహిళలు కూడా ఉన్నారు. పర్వతారోహణ కు అనేక మాసాల శిక్షణ, తయారీ మరియు సమయాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించుటకు దాదాపు 65,000 డాలర్ల రుసుము, ఖరీదైన పరికరాలు అవసరం అవుతాయి. ఎవరెస్ట్ పర్వతాన్ని అత్యధికంగా 21 సార్లు అధికోహించిన రికార్డును 'అపా షెర్పా' మరియు 'పుర్బా షెర్పా'లు దక్కించుకున్నారు. ప్రతి ఏటా మే, సెప్టెంబర్ మాసాలు ఎవరెస్టు ఎక్కడానికి అనువైన సీజన్లుగా గుర్తించారు. పర్వతారోహకులకు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకు 19 రోజులు, అక్కడి నుండి ఎవరెస్ట్ శిఖరాగ్రానికి దాదాపు 40 రోజుల సమయం పడుతుంది. ప్రతి ఏటా దాదాపు 800 మంది ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహిస్తున్నారు. ఎన్ని అవాంతరాలు, ప్రతి కూలతలు ఎదురైన పర్వతారోహకులు ఎవరెస్ట్ లాంటి అత్యంత ఎత్తైన మంచు పర్వతాన్ని అధిరో హించాలని తపన పడడం అభినందనీయం. ప్రా ణాలకు తెగించి సాహసం చేసే పర్వతారోహణ సాహస వీరులకు శుభాకాంక్షలు తెలియజేద్దాం, ఆ క్రీడ పట్ల యువతను ప్రోత్సహిద్దాం.

# తెలుగు వారికి హస్త భూషణం శంకర నారాయణ నిఘంటువు

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య సాధనే ఏకైక లక్ష్యంగా, అఖండ భారతావనిలో అడుగిడిన శ్వేత జాతీయులు, మొదటగా ప్రారంభించింది వ్యాపారమే. అయితే ముందు వ్యాపారం చేయడానికి, అనంతరం అధికారం చెలాయించడానికి. ఇక్కడి భాషలు రావు. స్థానికలకు భాష వారికి అర్థమయ్యేది కాదు, అలాగే వారి భాష ఈ దేశస్తులకు బోధపడేది కాదు. వ్యాపారం, పరిపాలన అవసరాల దృష్ట్యా, ఆంగ్ల అధికారులు మెలమెల్లగా స్థానికుల భాషల పదాలను తమ భాషలోని తర్జుమా చేసుకోవడం ప్రారంభించారు. ఈ క్రమం లోనే తెలుగు పదాలను అర్థం చేసుకుంటూ, తర్జుమా చేసుకున్నారు. తద్వారా నిఘంటువులు తయారు చేశారు. అలా 1818లో విలియం బ్రౌన్ తొలి తెలుగు ఇంగ్లీషు నిఘంటువు తయారు చేశాడు. జాన్ కార్నిక్ మారిస్ అనే వ్యక్తి ఇంగ్లీషు తెలుగు నిఘంటువు తయారు చేశాడు. 1821లో క్యాంప్ బెల్ ఇలాంటిదే ఇంకో నిఘంటువు తయారు చేశాడు. తరువాత సీ.పీ. బ్రౌన్ దొర ఇంకో నిఘంటువు 1852 లో (ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి సరిగ్గా అయిదేళ్ల ముందు) తయారు చేశాడు. చాలా మంది తెల్ల అధికారులు ద్విభాషలను తెలిసిన వారినే పెట్టుకున్నారు.

అయితే అందరికీ రెండు భాషల్లో అంత ప్రావీణ్యం ఉండక పోవడం సహజమే. వారి అనువాదం అంత కచ్చితంగా ఉండేది కాదు. ఈ సమస్యను సాధ్యమైన రీతిలో అధిగమించడానికి ఆచార్య పాలూరి శంకరనారాయణ విశేష కృషి చేశారు. తొలి ఇంగ్లీష్, తెలుగు నిఘంటువును రూపొందించాడు. ఆచార్య పాలూరి శంకర నారాయణ భాషావేత్త, నైఘంటికుడు, సంస్కృతాంధ్ర పండితుడు, రాయల్ ఏషియాటిక్ సొసైటీ సభ్యుడు. శ్రీకాకుళంలో జన్మించి, మున్సిపల్ హైస్కూల్ లో చదివి, అక్కడే కొంతకాలం ఉపాధ్యాయునిగా పని చేశారు. తర్వాత మద్రాసులో ప్రెసిడెన్సీ కళాశాలలో గణిత శాస్త్ర ఆచార్యుని గా, మద్రాసు విశ్వ విద్యాలయంలో ప్రధాన పరీక్షల అధికారిగా కూడా పని చేశాడు. కొచ్చిన్ యువ రాజులు, యుక్తవయసులో ఉన్న పిఠాపురం రాజా వంటి వారికి విద్యాబోధన చేశాడు. శంకర నారాయణ రచించిన తెలుగు ఇంగ్లీషు, తమిళంఇంగ్లీషు నిఘంటువు చాలా ప్రసిద్ధి చెందినది. శంకర నారాయణగా పేరొందిన ఆయన పూర్తిపేరు పాలూరి శంకర నారాయణ శ్రేష్ఠి. ఆయన తయారు చేసిన తొలి ఇంగ్లీషు తెలుగు నిఘంటువు పేరే శంకర నారాయణ నిఘంటువు.

తన జీవిత కాలంలో ఆయన తమిళనాడు రాజధాని మద్రాసు, ఒరిస్సాలోని గంజాం, జయపురం, మన రాష్ట్రంలోని విజయనగరం, పిఠాపురం, నూజివీడు, నెల్లూరు, కేరళలోని కొచ్చి లను సందర్శించాడు. రాచబిడ్డలకు చదువులు చెబుతున్నప్పుడే ఆయన వారి సౌలభ్యం కోసం ఇంగ్లీషు పదాలు, వాటి తెలుగు అర్థాల జాబితాను తయారు చేశాడు. తరువాత దాన్నే వ్యవస్థీకరించి, ఇంగ్లీషు తెలుగు నిఘంటువుని తయారు చేశాడు. అంతే కాదు, ఆయన తమిళ ఇంగ్లీషు, ఇంగ్లీషు తమిళ నిఘంటువులను కూడా తయారు చేశాడు. 1900 ప్రాంతంలో తెలుగు ఇంగ్లీషు నిఘంటువు కూడా తయారు చేశాడు. ఆయన తయారుచేసిన తెలుగు నిఘంటువు 1897లో ప్రచురితమైంది. ఆయన బతికుండగానే అయిదు ముద్రణలకు నోచుకుంది. ప్రతి ముద్రణకీ కొత్త పదాలను కలిపారు. ఆయన 192425 ప్రాంతంలో చని పోయాడు. ఆ తరువాత 1927 లో గిడుగు సీతాపతి, 1951 లో చిలుకూరి నారాయణ రావు, తరువాత వేదం లక్ష్మీనారాయణ కొత్తకొత్త పదాలను జోడించారు. 1953 లో నారాయణ అయ్యర్ దీనిని పరిష్కరించారు. ఇలా 1897




నుంచి 1953 వరకూ పదకొండు సార్లు పునర్ముద్రణ పొందింది ఈ నిఘంటువు. ఇప్పటికీ ఈ నిఘంటువుయే చాలా చోట్ల ప్రామాణికం. తరతరాల విద్యార్థులకు ఇది హస్త భూషణంగా నిలిచింది. 2004 అక్టోబరులో విజయవాడకు చెందిన విక్టరీ పబ్లిషర్స్ దీన్ని మళ్లీ ముద్రించారు. ఆగస్టు 2005 నాటికి మలి ముద్రణ అవసరమైంది. మళ్లీ 2006, 2007లలో పునర్ముద్రించాల్సి వచ్చింది. కోస్తా, తమిళనాడుల్లో ఆంగ్ల భాష నేర్చు కోవడంలో ఆయన పాత్ర అనన్య సామాన్యం. ఆయన పేరుతోనే ఆయన వ్రాసిన నిఘంటువు పేరొందింది. ఇప్పటికీ శంకరనారాయణ నిఘంటువు అంటే ప్రామాణికమే. ఎస్.రామానుజం చెట్టియార్ ప్రోత్సాహంతో రూపొందిన ఈ తెలుగు ఇంగ్లీషు నిఘంటువు మొదటి సారిగా 1900 సంవత్సరంలో మద్రాసు నుండి ప్రచురించ బడింది. తరువాతి కాలంలో అంటే 1927 వరకు చివరి సారిగా ముద్రించారు. దీనిని వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రులు 1953లో తిరిగి ముద్రించ తల పెట్టగా, ఎస్. నారాయణ అయ్యం గార్, వేదం లక్ష్మీ నారాయణ శాస్త్రి అశేష కృషి చేశారు. అలా సదరు సమగ్ర ప్రచురణ 31 జనవరి, 1953లో ప్రచురించ బడింది. ఇది

"ఆసియన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్" వారు 2003 సంవత్సరంలో మద్రాసు, న్యూ ఢిల్లీ నుండి ప్రచురించ బడింది.

# కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష

**విశ్వంభర, యాదాద్రి భువనగిరి:** కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం నాడు ఆయన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలుతో కలిసి జిల్లా కలెక్టర్ హనుమంతు కె జండగే గారి సమన్వయంతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 22 నుండి పార్లమెంట్ మొట్టమొదటి బడ్జెట్ సమావేశాలు మొదలవుతున్నందున పార్లమెంట్ సభ్యుడినైన నా నుండి ప్రజలు ఎన్నో ఆశిస్తారని, వారి అంచనాలకు అనుగుణంగా ప్రశ్నోత్తరాల సమయంలో జిల్లా ప్రజల సమస్యలపై వివరించడానికి ఇలాంటి సమీక్ష కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికి అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఇన్ పుట్ అందించి అందుకు అనుగుణంగా అభివృద్ధి నిధులు పొందాల్సి ఉందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 31 వేల కోట్లతో ఆగష్టు చివరిలోపు 2 లక్షల రైతు రుణ మాఫీ చేసి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నారని అన్నారు. రైల్వే శాఖ గురించి మాట్లాడుతూ జనగాం యాదాద్రి స్టేషన్ పనుల నిధులు శాంక్షన్ అయ్యాయని, జనగాం స్టేషన్ 50 శాతం, యాదాద్రి స్టేషన్ 20 శాతం పనులు కావడం జరిగిందని, డిసెంబరు చివరి లోగా అన్ని పనులు పూర్తి అయ్యేలా రైల్వే అధికారులు పూనుకోవాలని తెలిపారు. నేషనల్ హైవే అథారిటీస్ పై మాట్లాడుతూ చిట్యాల భువనగిరి రోడ్డు విస్తరణ కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చి అనుమతులు సాధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి ఎం.ఎ. కృష్ణన్, జిల్లా పరిషత్ సీఇఓ శోభారాణి, మున్సిపల్ చైర్మన్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.






## భారత నేవిదళం రాడార్ ఏర్పాటు


**విశ్వంభర, పూడూరు :** పరిగి నియోజకవర్గం పూడూరు మండల పరిధిలోని దామగుండం అడవి ప్రాంతంలో శుక్రవారం భారత నేవిదళం రాడార్ ఏర్పాటు ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి తో కలిసి స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సందర్శించారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రూ. 2,500 కోట్లతో ఈనెల 28వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేవీ రాడార్ స్టేషన్ ను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. హెలి ఫ్యాడ్, సభ స్థలాన్ని పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పీఎసీఎస్ చైర్మన్ సతీష్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు లాలూ కృష్ణ, డీసీసీ కార్యదర్శి పెంటయ్య, కాంగ్రెస్ నాయకులు ఆనందం, కుమ్మరి స్వామి, భాస్కర్, రాజ పుల్లారెడ్డి, శ్రీనివాస్ గుప్తా, అధికారులు, పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల బ్యాంకు రుణాలను మాఫీ చేయాలి



**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం చేనేత సహకార సంఘం కార్మికులు సమావేశం ఏర్పాటు చేశారు. చేనేత కార్మికులు తీసుకున్న బ్యాంకు రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం చేనేత కార్మికులు తాము నేసిన వస్త్రాలు అమ్ముడుపోక బీదరికం అనుభవిస్తూ బ్యాంకు రుణాలు కట్టలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. బ్యాంకు వారు లాయర్ నోటీసులు పంపించడం వలన కార్మికులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున తమ యొక్క బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గతంలో ఉన్నటువంటి త్రిబుల్ స్కీం, నూలు సబ్సిడీ, చేనేత భీమా, చేనేత వృద్ధులకు కొత్త పింఛన్లు, మొదలగు పథకాలన్నీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగిశెట్టి లక్ష్మీనారాయణ, ఏలే అశోక్, సింగం కృష్ణ, గుర్రం సత్యనారాయణ, గంజి రాములు, దోనాల శ్రీను, దోర్నాల దాసు, దోర్నాల సత్యనారాయణ, ఎలే యాదగిరి, విడం వెంకటేశం, కర్నాటి నరేష్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## సీతా రామ ఎత్తిపోతల పథకం పంప్ 2 నుండి నీళ్లు విడుదల



**విశ్వంభర, ఖమ్మం :** సీతా రామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ లో ఒక ముఖ్యమైన మైలురాయిని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవలే ఈ పంప్ హౌస్ వద్ద 25 మెగావాట్ల పంపు కోసం విజయవంతమైన తడి ట్రయల్ రన్ నిర్వహించారు. ముఖ్యంగా తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, నీటిపారుదల అధికారులు మరియు ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు ఈ ట్రయల్ రన్. ఇక భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం మరియు మహబూబాబాద్ మీదుగా దాదాపు ఏడు లక్షల ఎకరాల భూమికి జీవనాధారమైన సాగునీటిని అందించడంలో ఈ ప్రాజెక్ట్ లక్ష్యాన్ని సాధించడంలో కీలకమైన ముందడుగును సూచిస్తుంది. తాజాగా తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. గోదావరి ఏరులై పారుతుంది. దీంతో సీతారామ ఎత్తిపోతల పథకం పంప్ 2 నుంచి తాజాగా నీటిని వదిలారు. ఆ నీటిని చూస్తుంటే జలకళ అట్టే ఉట్టిపడినట్టుంది. చూసేందుకు చాలా ఆకర్షణీయంగా కనిపించడం విశేషం.

## కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 11 మంది ఎస్సైల బదిలీ



**విశ్వంభర, కరీంనగర్:** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 11 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ శుక్రవారం కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ఉత్తర్వులు జారీ చేసారు. ఈ ఉత్తర్వుల ప్రకారం టాస్క్ ఫోర్స్ లో పనిచేస్తున్న ఎస్.శ్రీధర్ ను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు, కమీషనరేట్ ఆఫీస్ నందు పనిచేస్తున్న జి.అనూష ను చొప్పదండి ఎస్సైగా, చొప్పదండి ఎస్సై గా పనిచేస్తున్న ఉపేంద్రాచారిని కరీంనగర్ ట్రాఫిక్ విభాగానికి, కమీషనరేట్ ఆఫీస్ నందు పనిచేస్తున్న యూనస్ అహ్మద్ అలీని హుజురాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కు, కమీషనరేట్ ఆఫీస్ నందు పనిచేస్తున్న టి. వివేక్ ను జమ్మికుంట పోలీస్ స్టేషన్ కు, కరీంనగర్ ట్రాఫిక్ లో పనిచేస్తున్న డి. చంద్రశేఖర్ ను కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు, కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న పి. అభిలాష్ ను కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ కు, జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న ఎస్. రాజేష్ ను బీ.ఆర్. కరీంనగర్ కు, కమీషనరేట్ ఆఫీస్ నందు పనిచేస్తున్న ఎన్. శ్రీనివాస్ ను కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ కు, హుజురాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న జి. సాంబయ్య ను సీసీఎస్ పోలీస్ స్టేషన్ కు, కరీంనగర్ వి.ఆర్. లో వున్న ఎస్. హనుమంతరావును పోలీస్ కంట్రోల్ రూమ్ కు బదిలీ చేశారు.

# రైతు రుణామాఫీ పేరుతో రేవంత్ సర్కార్ నయా మోసము: ఎంపీ డీకే అరుణ



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో రైతు రుణామాఫీ పేరుతో రేవంత్ సర్కార్ నయా మోసానికి తెర లేపిందని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ సెన్సేషనల్ కామెంట్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎంపీ డీకే అరుణ మీడియాతో మాట్లడుతూ.. ఖరీఫ్‌లో ఇవ్వాల్సిన రైతు భరోసా ఎగ్గొట్టి.. ఇప్పుడు ప్రభుత్వం రుణమాఫీ అంటూ ఊరూరా హడావుడి చేస్తోందని ధ్వజమెత్తారు. రూ.లక్ష లోపు తీసుకున్న రుణాల్లో అందులో సగం మందికి కూడా రుణమాఫీ కాలేదని తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ముప్పుతిప్పలు పడుతోందని ఆమె అన్నారు. ఇక గత్యంతరం లేక ఖరీఫ్ రైతు భరోసాకు ఎగనామం పెట్టి రుణ మాఫీ అంటూ నాటకాలు ఆడుతున్నారని ఫైర్ అయ్యారు. ఒక్క మహబూబ్‌నగర్ పరిధిలోని ఒక్క డీసీసీ బ్యాంక్‌లో 68,495 మంది రైతులు అప్పులు తీసుకున్నాని..అందులో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న వారు 51,415 మంది ఉంటే వారిలో ప్రభుత్వం 20,130 మందికి మాత్రమే రుణమాఫీ చేసిందంటూ మండిపడ్డారు. ప్రభుత్వం అబద్ధాలు చెబుతూ.. ప్రజలను నిండా మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా రుణమాఫీ మొత్తం చేశామంటూ ముఖ్యమంత్రితో సహా మంత్రులు మీడియా ముందు చెప్పడం హాస్యాస్పదంగాఉందని డీకే అరుణ విరుచుకుపడ్డారు.

# కాళోజి కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలి: కంచ అయిలయ్య



**విశ్వంభర, హనుమకొండ :** హనుమకొండలోని హరిత హోటల్ లో గద్దర్ సంస్మరణ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గద్దర్ గళం ఫౌండేషన్ కార్యదర్శి పసునూరి రవీందర్, కూరపాటి వెంకట నారాయణ,ప్రొఫెసర్ కంచ అయిలయ్య, పలువురు విద్యార్థి సంఘాల నేతలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ కంచ అయిలయ్య మాట్లాడారు.బాల సముద్రంలోని కాళోజి కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కళాక్షేత్రంలో గద్దర్ విగ్రహాన్ని స్థాపించాలని అన్నారు.కళాక్షేత్రానికి కాళోజీ పేరు ఉంచాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. కాళోజీ ఒక కవి అని.. కళాక్షేత్రానికి ఆయన పేరు కాకుండా గద్దర్ పేరు పెడితేనే దానికి దేశంలో ఒక గుర్తింపు, గౌరవం వస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం, ముద్రను మార్చినట్టే అలాగే కాళోజి కళాక్షేత్రం పేరును మార్చాలని విజ్ఞప్తి చేశారు.వరంగల్ జిల్లాలో చుక్క సత్తయ్య, శంకర్, సారంగపాణి లాంటి ఎందరో కళాకారులు జన్మించారని , ఇక్కడి కళాక్షేత్రాలకు వాళ్ల పేరు పెట్టే ఆలోచన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కళాక్షేత్రాలకు కళాకారుల పేరు మాత్రమే పెట్టాలని.. కాళోజీ పేరు ఏదైనా లైబ్రరీకి పెట్టాలని ఆయన అన్నారు. వెంటనే గద్దర్ విగ్రహ స్థాపక కమిటీ వేసి కళాక్షేత్రంలో గద్దర్ విగ్రహం పెట్టాలని గతంలో కేసీఆర్ చేసిన తప్పులు ఈ ప్రభుత్వ చేయొద్దని అన్నారు.



# నిండుకుండలా మేడిగడ్డ

**విశ్వంభర, భూపాలపల్లి:** లక్ష్మీ బ్యారేజి కాళేశ్వరం ఎత్తిపోతల పథకం లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని మేడిగడ్డ వద్ద నిర్మించిన బ్యారేజీ. గోదావరి నదిలోని నీటిని తాగునీరు, నీటిపారుదల కోసం ఉపయోగించుకోవడమే ప్రధాన లక్ష్యంగా లక్ష్మీ బ్యారేజి నిర్మించబడింది. దీని పూర్తి నిల్వ నీటి సామర్థ్యం 16.17 టీఎంసీలు. 2016 మే 2న మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మేడిగడ్డ వద్ద నిర్మించే బ్యారేజి పనులకు శంకుస్థాపన చేశారు. గోదావరి నది నుంచి 160 టీఎంసీల నీటిని తరలించడం ద్వారా 16,50,000 ఎకరాలకు సాగునీరందించే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం లో భాగంగా కరీంనగర్ జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించి రివర్స్ పంపింగ్ విధానం ద్వారా నీటిని ఎత్తిపోయడానికి డిజైన్ చేశారు. ఈ బ్యారేజ్ పై ఇప్పటికే కుంగిపోయిందని.. కూలిపోయింది అన్న తప్పుడు వార్తలు పటాపంచలు చేస్తూ నిండు కుండలా మారింది మేడిగడ్డ ప్రాజెక్ట్. తాజాగా +92.40/100.00 M లెవెల్ లో వాటర్ నిండి ఉన్నాయి. టోటల్ ఇన్ఫ్లో/ఔట్ ఫ్లో: 3,40,00/3,41,000 క్యూసెక్కులు ఉండటం విశేషం.



## హైడ్రా చైర్మన్‌గా సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వుల జారీ చేసింది. జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ వరకు హైడ్రా అధికార పరిధిల విస్తరించి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 'హైడ్రా'కు చైర్మన్ సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరించనున్నారు. ఇందులో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ కు చెందిన జిల్లా మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ప్రిన్సిపల్ సెక్రటరీ, జీహెచ్ఎంసీ మేయర్ సభ్యులుగా కొనసాగనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చెరువులు, కుంటలను పరిరక్షించడం, నాలాలు, సర్కారు భూములు, స్థిరాస్థులు కబ్జాకు గురికాకుండా 'హైడ్రా' నిరంతరం పర్యవేక్షించనుంది. అదేవిధంగా పెద్ద పెద్ద హోర్డింగులు, ఫ్లెక్సీల నియంత్రణ, వాటర్ పైపు లైన్లు, కరెంట్ సప్లై లైన్లు, డ్రైనేజీ, వరద నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ లాంటి సేవల్లో ఇక నుంచి 'హైడ్రా' భాగస్వామ్యం కానుంది. జీహెచ్ఎంసీ చుట్టూ ఉన్న 27 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, 33 మేజర్ పంచాయతీల వరకు 'హైడ్రా' అధ్వర్యంలో కొనసాగుతాయి. ఈ సంస్థకు డీఐజీ స్థాయి అధికారి డైరెక్టర్, ఎస్పీ స్థాయి అధికారులు అదనపు డైరెక్టర్లుగా నియమించనున్నారు.

## బీసీ జనగణన తర్వాతే పంచాయతీ ఎన్నికలు

### మంత్రి పొంగులేటి

**విశ్వంభర, హైదరాబాద్ :** బీసీ జనగణన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.నాలుగు గోడల మధ్య మేము నిర్ణయాలు చేయడం లేదని, మాది ప్రజా ప్రభుత్వమని ప్రజల మధ్యలో వారి అభిప్రాయాలకు అనుగుణంగా పాలన చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం కేంద్రం తో భేషజాలకు పోయి రాష్ట్ర ప్రయోజనాలను ఇబ్బంది పెట్టిందని..రాష్ట్రాలకు రావాల్సిన నిధులను సక్రమంగా ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నామని ఆయన వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్, సాగునీటి అవినీతి లాంటి అనేక విధ్వంసమ్ చేశారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీ నామ మాత్రంగా కూడా మిగలదు... పేకమేడలా కూలిపోతుంది... వారే కూల్చుకుంటున్నారని అన్నారు.ధనిక రాష్ట్రం అని బయటకి గొప్పలు చెప్పి లోపల అప్పులు చేసిందని మండిపడ్డారు.కేంద్రం నుండి సాయం అడిగితే నామోషీ అని మిషన్ భగీరథ లాంటి వాటికి నిధులు అడగలేదని బీఆర్ఎస్ పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పాడి రైతులకు అవగాహన సదస్సు



**విశ్వంభర, కర్తాల్ :** రంగారెడ్డి జిల్లా కర్తాల్ మండలం రావిచెడు గ్రామంలో హెరిటేజ్ డైరీ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన సదస్సు రుణ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జోనల్ ఇన్చార్జ్ సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డైరీ ద్వారా దాన సబ్సిడీ, పశువులకు ఇన్సూరెన్స్ సబ్సిడీ, లోన్ సదుపాయాల గురించి పశుపోషణ గురించి అవగాహన కల్పించడం జరిగింది. హెరిటేజ్ డైరీలో పాలు పోసే ప్రతి రైతుకు రెండు లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా గ్రామంలోని హెరిటేజ్ కి పాలు పోసే రైతులకు 50 వేల చొప్పున 100 మందికి రుణ సదుపాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా మేనేజర్ వెంకటేశం, ప్లాంట్ మేనేజర్ నరేష్‌సూపర్వైజర్ శివ, డాక్టర్ ప్రభాకర్, ఏజెంట్ శ్రీశైలం, గ్రామ పెద్దలు, గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

# అమ్మాయిలను వేధిస్తే కొత్త చట్టాల ప్రకారం కఠిన చర్యలు



**విశ్వంభర, ఇల్లందు :** భద్రాద్రి జిల్లా ఇల్లందు డీఎస్పీ ఎన్. చంద్రబాను, సీఐ సత్యనారాయణ ల ఆధ్వర్యంలో జూనియర్ కాలేజీ విద్యార్థులకు న్యూ క్రిమినల్ లా అండ్ సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు న్యూ క్రిమినల్ లా అండ్ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అపరిచిత వ్యక్తులతో ఫోన్ కాల్స్ గాని వాట్సాప్ కాల్ గాని మాట్లాడవద్దని అపరిచిత వ్యక్తులు కానీ అపరిచిత గ్రూపుల నుండి వచ్చినటువంటి తెలియని లింకులను ప్రెస్ చేయవద్దని వివరిస్తూ ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వెంటనే 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలని, మహిళలు ఆపద సమయంలో డయల్ 100, షీ టీమ్ నెంబరుకు సంప్రదించాలని అన్నారు. ఆడవాళ్ళు ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు, ఏదైనా సమస్య వచ్చినపుడు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి 'టీసేఫ్ యాప్' ను ప్రతి ఒక్క మహిళ ఉపయోగించుకోవాలని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు మౌనంగా భరించ కుండా ముందుకు వచ్చి షీ టీమ్ ని సంప్రదించి, వారి సమస్యలను పరిష్కరించుకొవాలని తెలిపారు. ప్రత్యేకంగా చిన్న పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మీద అవగాహన కల్పించాలని అవసరమైన ఆత్మ రక్షణ విద్యలను నేర్చుకోవాలి అని సోషల్ మీడియా ను వాడుతున్న వారు వాటి పరిధిని తెలుసు కోవాలని అపరిచిత వ్యక్తులతో మాట్లాడరాదని, ఒక వేళ సోషల్ మీడియాలో హరాస్మెంట్, సైబర్ క్రైమ్ కు గురి అయితే తక్షణమే షీ టీమ్ కానీ, పోలీసులకు కానీ సంప్రదించాలని తెలియజేశారు.

షీ టీంను సంప్రదించడానికి 'క్యూ ఆర్ కోడ్' విధానాన్ని ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్ స్టాగ్రామ్, ఉపయోగించుకోవాలని, సోషల్ మీడియా లో కూడా షీ టీం ను సంప్రదించవచ్చని అన్నారు. మానవ అక్రమ వివాహ రవాణా, ఉమెన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ క్యూఆర్ కోడ్ పిటిషన్, సైబర్ నేరాలు, సైబర్ సెక్యూరిటీ సేవలు, 1930, మరియు ఫోక్సో చట్టాల గురించి 120మంది విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. ఈ అమ్మాయిలు వివిధ గ్రామాల నుండి వస్తుంటారు. ఎవరిని గుడ్డిగా నమ్మొద్దని తమ వ్యక్తిగత విషయాలను వ్యక్తిగత ఫోటోలని సోషల్ మీడియాలో గాని, ఇతరులకు గాని షేర్ చేయొద్దని. ఆ ఫోటోలను అడ్డుపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేసే అవకాశం ఉంటుందని, కావున తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఒకవేళ ఎవరైనా అలా బ్లాక్మెయిల్ చేసినట్లయితే పరువు పోతుందని భయపడ కుండా షీ టీమ్ ని సంప్రదించాలని డీఎస్పీ తెలిపారు. షీ టీం కి కంప్లైంట్ చేసినట్లయితే కంప్లైంట్ యొక్క వివరాలు గొప్యంగా ఉంచబడతాయని అన్నారు, బాధితురాలు షీ టీమ్ ఆఫీస్ కి రాలేని పక్షంలో షీ టీం సభ్యులే వారి దగ్గరికి వెళ్తారని కావున ఎలాంటి భయం లేకుండా కంప్లైంట్ చేయాలని, వారికి డీఎస్పీ చంద్రబాను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సిఐ బత్తుల సత్యనారాయణ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎక్సైజ్ కార్యాలయంలో తాటి, ఈత మొక్కలు



**విశ్వంభర, ఆమనగల్లు :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన వన మహోత్సవంలో భాగంగా ఆమనగల్ ఎక్సైజ్ పరిధిలోని 20 వేల తాటి ఈత ఖర్జూర మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు. తలకొండపల్లి మండలంలోని బదనాపూర్ గ్రామంలో ఆమనగల్ ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహన్ హాజరై ఈత మొక్కలు నాటారు. ఆమనగల్ ఎక్సైజ్ పరిధిలోని ప్రతి గ్రామంలో గౌడ కులస్తులందరూ ప్రభుత్వ ఖర్జూర, ఈత, తాటి లాంటి మొక్కలు నాటుకొని లబ్ధి పొందాలని సిఐ తెలిపారు. బదనాపూర్ గ్రామంలోని కృష్ణ గౌడ్, శివకుమార్ గౌడ్ ల వ్యవసాయ పొలములో 1000 వరకు ఈత మొక్కలు నాటినట్లు తెలిపారు. ఎవరైనా ఈతమొక్కలు, తాటి మొక్కలు పెంచడానికి కావాలనుకుంటే ఆమనగల్ ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై అరుణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, లోయ, రాణి గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజలను సురక్షత ప్రాంతాలకు తరలింపు



**విశ్వంభర, అశ్వారావుపేట :** బంగాళాఖాతం లో అల్పపీడనం ప్రభావంతో విస్తరంగా కురుస్తున్న భారీవర్షాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని గుమ్మడివల్లి పెద్దవాగు ప్రాజెక్ట్ కు వరద ఉధృతి వలన దిగువన ఉన్న గ్రామాలకు ముంపు ప్రమాదం పొంచి ఉన్నది. అలాగే ఆంధ్ర ప్రదేశ్ సరిహద్దు గ్రామాలకు కూడా ప్రమాదం ఉందని తెలుసుకుని స్థానిక MLA జారె ఆదినారాయణ, పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు రాత్రి సమయంలో కూడా ప్రాణనష్టం సంభవించకుండా అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అధికారులతో కలసి స్వయంగా సహాయక చర్యలలో పాల్గొని వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తు న్నారు.

# అక్రమ వసూళ్ల ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్

- శ్రీవారి భక్తులను ఏమార్చి అక్రమాలకు వసూళ్లకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తిరుపతి డీఎస్పీ రవి మనోహర్ ఆచారి.



**విశ్వంభర, తిరుపతి :** తిరుపతికి వచ్చే శ్రీవారి భక్తులను ఏమార్చి అక్రమంగా డబ్బులు గుంజుతున్న దళారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతిలోని ఆరుగురు ఆటో డ్రైవర్లను తీవ్రంగా హెచ్చరిస్తూ తిరుపతి డీఎస్పీ రవి మనోహరాచారి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆరుగురు ఆటో డ్రైవర్లు టీటీడీ యాప్ ను తమ మొబైల్ లో డౌన్లోడ్ చేసుకుని రోజువారి అందుబాటులో ఉన్న శ్రీవారి దర్శన టోకెన్లను చూస్తారు. రైల్వే స్టేషన్ బస్ స్టేషన్ వద్ద భక్తులకు ఎలాగైనా దర్శనం టోకెన్లు ఇప్పిస్తామని నమ్మబలికి విష్ణు నివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాస మంగాపురం ప్రాంతాలలో సర్వదర్శనం టోకెన్ల కౌంటర్ వద్ద భక్తులకు సర్వదర్శన టోకెన్లు ఇప్పించి అధిక మొత్తంలో అమాయక భక్తుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని డీఎస్పీ తెలిపారు.

# నేడు విశ్వశాంతి కోసం మంగళాశాసనం



**యదాద్రి, విశ్వంభర :** యాదగిరిగుట్ట గట్టు వారి ఆశ్రమం, యదాద్రి పాదసన్నిధిలో శనివారం 10.00 గం.లకు గట్టు అరుందతి రంగాచార్యులు మంగళాశాసన గోష్ఠి ఏర్పాటు చేశారు. అరుందతి, రంగాచార్యులు భక్తుల చేత పాద పూజలు స్వీకరించి, తిరిగి ఇండియాకి వచ్చి విశ్వశాంతి కోసం 108 దివ్య దేశాలు దర్శించుకొని పాదయాత్రతో తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని చివరగా యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దర్శించుకొని పాదయాత్ర ముగింపులో భాగంగా మంగలాశాసన గోష్ఠి నిర్వహించారు. భక్తుల కోరిక మేరకు త్వరలో పాదపూజకు ఆహ్వానం వచ్చిందని ఆశ్రమ ప్రతినిధి ఓం శ్రీ ఆచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్టు పరివారంతో పాటు కిష్టాపురం సర్పంచ్ గట్టు నర్సింహా చార్యులు, వెంకటాచార్యులు, కేశవాచార్యులు, USA వేణు గోపాలాచార్యులు, ధన్వంతరి దేవాలయ నిర్మాత కాటూరి శ్రీను స్వామి, V3 న్యూస్ ఛానల్ ఆధ్యాత్మికవేత్త మాధవశేషు స్వామి పాల్గొంటారని ఓంశ్రీ ఆచార్యులు తెలిపారు.

# చేనేతకారుల ఎక్స్‌పోను ప్రారంభించిన నటి రాశి



**విశ్వంభర, హైదరాబాద్ :** బెంగాల్ హండ్లూమ్ ఆర్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో 2024, శ్రీనగర్‌కాలనీలోని శ్రీసత్య నిగమాగమంలో శుక్రవారం నటి రాశితో ఆర్గనైజర్ సోమనాథ్, అభిజిత్ కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఎక్స్‌పో ఈ నెల 19 నుంచి 25 వరకు కొనసాగనున్నట్లు ఆర్గనైజర్ సోమనాథ్ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ లాంచ్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందని నటి రాశి అన్నారు. మన దేశానికి వస్త్ర ఉత్పత్తిలో సుదీర్ఘమైన మరియు విశిష్టమైన చరిత్ర ఉందని, మన సాంస్కృతిక ఫ్యాబ్రిక్‌లో చేనేత నేత ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. తరతరాలుగా ఈ పురాతన పద్ధతులను భద్రపరిచిన మన హస్తకళాకారుల శాశ్వత వారసత్వానికి ఇది నిదర్శనం అని రాశి అన్నారు. ప్రతిభావంతులైన నేత కార్మికులను ప్రోత్సహించడానికి సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు అభిజిత్. ఈ ఎగ్జిబిషన్‌లో బనారసి చీర, భాగల్‌పురి సిల్క్, బెంగుళూరు సిల్క్, చెన్నై సిల్క్, మైసూర్ సిల్క్, ధర్మవరం, పోచంపల్లి, జమ్దానీ, లెనిన్ కాటన్, టస్సార్, విష్ణుపురి సిల్క్, డ్రెస్ మెటీరియల్, చందేరి, ఆభరణాలు మొదలైనవి తమ కళను ప్రదర్శిస్తున్నారు.

# ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం వద్ద గోదావరి నది పరవళ్ళు తొక్కుతోంది. భారీ వర్షాల కారణంగా త్రివేణి సంగమంలోకి వరద నీరు అధికంగా వచ్చి చేరడంతో నీటిమట్టం 7.6 మీటర్లుగా నమోదయింది. ఇంకా ఐదు రోజులు భారీ వర్షాలు ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. పోలీసులు రెవెన్యూ శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలు భక్తులు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

# వాగులో కొట్టుకు పోయిన బొలెరో వాహనం



**విశ్వంభర భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దామెరకుంటగుండ్రాత్ పల్లి మధ్యలోని అలుగు వాగులో ఓ సరకు రవాణా ట్రాలీ వాహనం కొట్టుకు పోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వంట పాత్రలు, సామగ్రి విక్రయించే సరకు రవాణా ట్రాలీ వాహనం అన్నారం నుంచి దామెర కుంట వైపు వెళ్తుంది. అలుగు వాగు ఉద్ధృతిని గమనించకుండా డ్రైవర్ ముందుకు వెళ్లడంతో వాహనం వాగులో కొట్టుకునిపోయింది. దీంతో డ్రైవర్ వాహనం పైకి ఎక్కి ఆర్తనాదాలు చేశారు. గమనించిన గ్రామస్థులు అతనిని రక్షించారు. అయితే గురువారం సాయంత్రం నుంచే అలుగు వాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు అప్రమత్తమై రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు.

# తెలంగాణలో ఐదు రోజుల పాటు భా రీ వర్షా లు



**విశ్వంభర, హైదరాబాద్ :** వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడనం కారణంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం గా రాగల 5 రోజుల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. శుక్రవారం నుంచి శనివారం వరకు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ అయ్యింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, హన్మకొండ, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**విశ్వంభర, చంపాపేట :** లింగోజిగూడ డివిజన్ పరిధిలోని రాజేంద్ర మెమోరియల్ స్కూల్ సరూర్ నగర్ లో 199192 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు డివిజన్ పరిధిలోని కమ్యూనిటీ హాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ ఉపాధ్యాయులు నిర్మల, లీలా వతి, ఇంద్రాణి, అరుణ్ జ్యోతిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహేందర్, రాజు, సంతోష్, మధు, గౌరీ, అనిత, సావిత్రి, భాస్కర్ రెడ్డి, శివ, మల్లికార్జున్, శ్రీధర్, కిట్టు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో జిల్లా మత్స్యశాఖ అధికారి



**విశ్వంభర, సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఒక ఒక అవినీతి చేప చిక్కింది. జిల్లా మత్స్యశాఖ అధికారి టాగూర్ రూపేందర్ సింగ్ ఒక చాపల సొసైటీ సభ్యుడు నుండి రూ. 25,000 రూపాయల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల చెరువులలో చేపలు పట్టుకొనుటకు సొసైటీ కి అనుమతి ఇవ్వాల్సిందిగా సొసైటీ సభ్యులు జిల్లా మత్స్యశాఖ అధికారికి దరఖాస్తు పెట్టుకున్నారు. ఫిషింగ్ కి అనుమతి ఇవ్వకుండా రూపేందర్ సింగ్ గత కొన్ని రోజులుగా సొసైటీ సభ్యులు తిప్పుతున్నాడు. రూ. 25,000 లంచం ఇస్తేనే ఫిషింగ్ ఆర్డర్ ని ఇస్తానంటూ చెప్పటంతో సొసైటీ సభ్యులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు ఈ రోజు ఉదయం రూ. 25,000 రూపాయలు లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని రిమాండ్ కి తరలించారు. అయితే 2016లో రూపేందర్ సింగ్ నిజాంబాద్ జిల్లాలో పనిచేసిన సమయంలో రూ. 5,000 రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కేసు కూడా ఉన్నది. గత రెండు సంవత్సరాలుగా సూర్యపేట జిల్లాలో పనిచేస్తున్న ఇతనిపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నవి.

# అమ్మ మాట అంగన్వాడి బడిబాట



**విశ్వంభర, నారాయణఖేడ్ :** అమ్మ మాట అంగన్వాడి బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని అంగన్వాడి ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు గైకుంటుందని అందులో భాగంగానే అంగన్వాడీ కేంద్రంలో నూతన విద్యా విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను విద్యార్థులకు బోధించేందుకు అధికారులు శిక్షణను ఇచ్చారని ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న విషయాలను చిన్నారులకు అందించనున్నామని ఉపాధ్యాయుని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తున్నామని ప్రభుత్వ లక్ష్యం మేరకు అంగన్వాడి కేంద్రాల బలోపేతానికి తమ వంతు కృషి సల్పుతామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ బడిబాట కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయునిలు సరళ, స్వరూప, సుక్కమ్మ, అనురాధ, అనురాధ, స్వాతి, విజయనిర్మల, వై విజయ పాల్గొన్నారు.

# పాతబస్తీలో అగ్ని ప్రమాదం

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ లోని పాతబస్తీలో అగ్ని ప్రమాదం జరిగింది. మదీనా నయాబ్ హోటల్ రెండవ అంతస్తులో ఒక్కసారి మంటలు ఎగిసి పడ్డాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది. ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలు అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు.



# లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం మహదేవ్ పూర్ మండలంలోని బొమ్మాపూరు శివారు కోతకు గురైన మందిరం చెరువు కట్ట, బొమ్మపూర్ ఎస్సీ కాలనీలోని దూదేకుల ఓర్రె, ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయితీ భవనం, పెద్దంపేట వాగు వరద ఉధృతిని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. బొమ్మపూరు శివారు మందిరం చెరువు వర్షం కారణంగా నిండి మత్తడి పోస్తుందని, చెరువు కట్ట కోతకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్థులు తెలుపగా వెంటనే చెరువు కట్టకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి పటిష్టం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బొమ్మపూరు ఎస్సీ కాలని వద్ద గల దూదేకుల ఒర్రే కల్వర్టును పరిశీలించి ఆర్ & బీ అధికారులతో ఫోన్ లో మాట్లాడి నీరు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అక్కడే ఉన్న ప్రాథమిక పాఠశాలను, గ్రామ పంచాయితి భవనాన్ని పరిశీలించి నాలుగవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం అంబటి పల్లి శివారులోని పెద్దంపేట వాగు బ్రిడ్జిని, వాగు వరద ప్రవాహాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదవుతుందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువులు, కుంటలపై నిరంతర నిఘా ఉంచాలని అన్నారు. పంచాయితి కార్యదర్శులు గ్రామ స్థాయిలో ప్రతి విషయంపై అప్రమత్తతతో వ్యవహరిస్తూ ఏదైనా సమస్య ఉంటే సమాచారం అందించాలని తెలిపారు. ప్రజలు పొంగి పొర్లే వాగులు, రహదారుల్లో ప్రయాణాలు నియంత్రణ చేయాలని సూచించారు. రానున్న 4 రోజులు జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో చెరువులు కోతకు గురవకుండా పరిరక్షణ చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. చెరువులు పరిశీలించాలని లోతట్టు ప్రాంతాల ప్రజల రక్షణ చర్యలు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ముంపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ముంపు తగ్గేవరకు అధికారులు అత్యంత జాగ్రత్తగా ఉంటూ పరిస్థితులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ళు, వంగిపోయిన విద్యుత్ స్థంభాలు, వంగిన చెట్లు పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కర్మాగారం



**విశ్వంభర, కాల్వ శ్రీరాంపూర్ :** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలో తిరుమల కంపెనీ వారు కొత్తగా నిర్మించ తలపెట్టిన ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కర్మాగార నిర్మాణ ప్రారంభోత్సవానికి గౌరవ మంత్రులు శ్రీధర్ బాబు గారు, పొన్నం ప్రభాకర్ తో కలిసి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం రెడ్డి ఫంక్షన్ హాలులో కాల్వ శ్రీరాంపూర్ మండలం పామ్ ఆయిల్ రైతులను ఉద్దేశించి మంత్రి తుమ్మల ప్రసంగించారు. జీతాలు కూడా సరిగా ఇవ్వలేని స్థితిలో గత బీఆర్ ఎస్ ప్రభుత్వం ఖజానా అప్పచెప్పినా కూడా ఒక్కొక్క పథకాన్ని ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తున్నామని అన్నారు. గత పదేళ్ల కాలంలో రైతుకు గిట్టుబాటు ధర లేదు, సబ్సిడీ విత్తనాలు లేవు, రైతుబంధు పేరుతో అన్ని పథకాలు ఆపారని మంత్రి తుమ్మల దుయ్యబట్టారు. పామ్ ఆయిల్ సాగుచేసే రైతులకు సబ్సిడీ కూడా విడుదల చేయలేదని, రైతు రాబోయే ఐదు సంవత్సరాలు కాలు మీద కాలు వేసుకునే రోజు వచ్చేలా ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని తుమ్మల అన్నారు. పెద్దపల్లి జిల్లాలో కంపెనీ ప్రారంభించడానికి వచ్చిన తిరుమల ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ దేశానికి సరిపడా పామ్ ఆయిల్ ను ఉత్పత్తి చేసే సామర్థ్యం మన రాష్ట్ర రైతులకు ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలియజేశారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం




**విశ్వంభర, వెల్దండ :** నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్ హాల్లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో శంకర్ నేత్రాలయ వారి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథి సుంకిరెడ్డి కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మెగా ఉచిత కంటి వైద్య శిబిరం జూలై 19 శుక్రవారం నుండి జూలై 27 శనివారం వరకు 9 రోజుల పాటు కొనసాగుతుందని కల్వకుర్తి నియోజకవర్గ ప్రాంత ప్రజలు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్షలతో పాటు కంటి శుక్లాలకు కూడా సర్జరీ చేయడం జరుగుతుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలియజేశారు. నియోజకవర్గ ప్రాంత పేద ప్రజల కోసం ప్రముఖ వైద్య నిపుణులు శంకర నేత్రలయ వారిని అందుబాటులోకి తీసుకువచ్చి శిబిరాన్ని ఏర్పాటు చేశారని, ప్రతి నిరుపేద కుటుంబం ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకర నేత్రాలయ మెంబర్ అరుణ్ కుమార్ రామ్, నుంతల మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు రవికాంత్ గౌడ్, అభినవ్ రెడ్డి వెంకటరెడ్డి, నరేందర్ గౌడ్,ఫౌండేషన్ సభ్యులు రెడ్డి, యూసఫ్ బాబా, గణేష్, శ్రీపతి, శేఖర్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఫ్రైడే డ్రై డే ప్రోగ్రాంలో వన మహోత్సవం

**విశ్వంభర, ఆమనగల్లు, జూలై 19 :** ఆమనగల్లు పురపాలక సంఘం ఆధ్వర్యంలో 11 వ వార్డు ఆదర్శ నగర్ కాలనీలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు, వార్డులో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా కాలనీలో కలుషిత నీరు ఉండకుండా స్వయంగా పర్యవేక్షించారు, పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకొవాలని సీజనల్ వ్యాధులు రాకుండా చూసుకోవలని అందరూ ఆరోగ్య విషయంలో దోమల బారిన పడకుండా శ్రద్ధ వహించి జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ వసంత కాలనీ వాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ వసంత, కౌన్సిలర్ యాదమ్మ శ్రీశైలం, చెన్న కేశవులు, బైకని శ్రీశైలం పందుల మత్తయ్య రంజిత్, రామకృష్ణ, మున్సిపాలిటీ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## రద్దీ ఎక్కువ బస్సులు తక్కువ.!



**విశ్వంభర, షాద్ నగర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో విపరీతమైన రద్దీ పెరిగింది. ఏ బస్సులో చూసినా ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటోంది. ఈ నేపథ్యంలో బస్సుల కోసం ప్రయాణికులతో పాటు విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యారంగం అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామంటూ ప్రకటనలు చేయడమే తప్పా విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో శ్రద్ధ వహించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత చదువుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాలంటే పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. కేశంపేట మండలంలోని లే మామిడి, కేశంపేట్, వేముల నర్వ, ఇప్పలపల్లి, పాపరెడ్డి గూడ గ్రామాల నుండి షాద్ నగర్ కు వెళ్లడానికి సమయానికి ఆర్టీసీ బస్సులు లేవని విద్యార్థినీ, విద్యార్థులు అంటున్నారు. ఉదయం నుంచి బస్సుల కోసం ఎదురు చూడడం తీరా బస్సులు వస్తే రద్దీగా ఉండడంతో ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను గ్రామాల్లో ఆపడం లేదని దీనితో కొంతమంది విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. మేము సకాలంలో కళాశాలలకు చేరుకోలేకపోతున్నామని తెలియజేస్తున్నారు. మరి కొందరు విద్యార్థులు ప్రమాదమని తెలిసినా తప్పని స్థితిలో పుట్ బోర్డు పై నిలబడి గ్రిల్స్ పట్టుకుని రాకపోకలు కొనసాగిస్తున్నారు. వేలాడతూ వెళ్లడం వల్ల పొరపాటున పట్టు తప్పితే ప్రమాదం బారిన పడక తప్పదు. దీంతో ఉదయం 8 గంటల నుంచి విద్యార్థులు మెయిన్ రోడ్డుకు చేరుకుంటున్నారు. ఆ సమయంలో ఉన్న బస్సులు కూడా కిక్కిరిసిన ప్రయాణికులతో వస్తుండడంతో బస్సులు ఆపకపోవడంతో ఆర్థిక భారమైనా ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్.టీ.సీ అధికారులు స్పందించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను నడపాలని విద్యార్థుల షాద్ నగర్ బస్సు డిపో వద్ద నిరసన వ్యక్తం చేశారు.



## డ్రగ్స్ ను తరిమేద్దాం.. పోస్టర్ ఆవిష్కరణ

**విశ్వంభర, హైదరాబాద్ :** డ్రగ్స్ ను తరిమేద్దాం.. సీనియర్ జర్నలిస్ట్ ఏ.కొండల్ గౌడ్ పాడిన పాట పోస్టర్ ను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ ప్రభుత్వ పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కోదూరు శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.



## రైతు రుణమాఫీ దేశానికే తెలంగాణ రోడ్ మోడల్

**విశ్వంభర భూపాలపల్లి:** రైతు రుణమాఫీ దేశానికే మన తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్ అని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం రైతు రుణమాఫీ నిధుల విడుదల చేసిన సందర్భంగా శుక్రవారం భూపాలపల్లిలోని మంజూరు నగర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి నుండి స్థానిక అంబేద్కర్ సెంటర్ వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు, కాంగ్రెస్ నేతలతో పెద్ద సంఖ్యలో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని ఎడ్ల బండిని స్వయంగా నడిపి ప్రారంభించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ కు చేరుకునే ఒక్కసారిగా వర్షం కురియడంతో ఆ వర్షంలోనే సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ భారతదేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి దేశంలోనే నెంబర్ వన్ గా తెలంగాణ నిలిచిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ అమలు చేసిందని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు ఊబిలోకి నెట్టిందని అన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశాడని ఆరోపించారు. కష్టకాలంలో ఉండి కూడా సీఎం రేవంత్ రెడ్డి పైసా పైసా పోగేసి రైతు రుణమాఫీ చేయడానికి అహర్నిశలు కష్టపడి పని చేశారని అన్నారు.



## హరీష్ రావు వెంటనే రాజీనామా చేయాలి మహేశ్వరం కాంగ్రెస్ ఇంచార్జ్ కెఎల్ఆర్

**విశ్వంభర, ఎల్బీనగర్:** రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రుణమాఫీ చేస్తే హరీష్ రావు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తామని ప్రగల్భాలు పలికాడని వెంటనే రాజీనామా చేయాలని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేఎల్ఆర్ అన్నారు. శుక్రవారం ఆర్కే పురంలోని ఎన్టీఆర్ నగర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేక కార్యక్రమానికి కేఎల్ఆర్, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిలు హాజరయ్యారు. అనంతరం కిచెన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతుల రుణమాఫీపై మాట ఇచ్చి నిలబెట్టుకున్నామని అన్నారు. ఏకకాలంలో ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ప్రకటించిన తేదీలోపే సంపూర్ణంగా రుణమాఫీ చేశారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ మిత్తిలకు కూడా సరిపోలేదని, విమర్శించారు, ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్, బండి మధుసూదన్ రావు, జ్ఞానేశ్వర్ యాదవ్, కిరణ్, రమేష్ నేత, అక్బర్, లింగుస్వామి గౌడ్, దుబ్బాక శేఖర్, రాజు నాయక్, శేఖర్ ముదిరాజ్, కళ్యాణ్, పెదవూర సైదులు, మహేందర్, నబీ, శ్రీశైలం, శ్రీకాంత్ రెడ్డి, సలీం, పాషా, షఫీ, పటేల్, ప్రేమ్ , భాస్కర్, రవి,నాను నాయక్, నగేష్, పాండు, అనిల్, శశి, విప్లవ, అంజిరెడ్డి, లక్ష్మీ, రేణుక, మాధవి, సంతోష, రమ, కవిత, జయశ్రీ, జయమ్మ, శ్వేత, స్వరూప, శైలజ, శానజ్ బేగం, మంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## భవిష్యత్ తరాలకు కొరకు మొక్కలు నాటాలి

### -డీఎస్పీ సంపత్ రావు


**విశ్వంభర, భూపాలపల్లి :** భవిష్యత్ తరాలకు మనం మంచి చేయాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో ఆయన విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుని మనుగడకు పచ్చదనం ఎంతో ముఖ్యమన్నారు. మన పూర్వీకులు వందేళ్లు ఆరోగ్యంగా బ్రతికారంటే దానికి చెట్లే కారణమన్నారు. మొక్క నుండి చెట్టు వరకు ప్రతి మనిషికి ఎంతో అవసరమన్నారు. పచ్చదనంలోకి వెళితే ఒత్తిడికి దూరమై ప్రశాంతత చేకూరుతుందన్నారు. మొక్క నుండి చెట్టుకు ఎదగాలంటే ఎంతో శ్రమ పడాల్సిన అవసరం ఉందన్నారు. అదే చెట్టును నరకాలంటే ఒక క్షణం చాలన్నారు. పచ్చని చెట్లను పెంచితే తప్ప మనిషికి మనుగడ లేదన్నారు. ఒక్కో వ్యక్తి ఒక మొక్క నాటి సంరక్షించాలని, మొక్కలు నాటిన వారు ఇంకో పది మందికి మొక్కలు నాటించే సంకల్పాన్ని కల్పించినట్లయితే వన మహోత్సవం విజయవంతమవుతుందని తెలిపారు. మనం ఆరోగ్యంగా ఉండాలి, సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సీఐ మల్లేష్, ఎస్ఐ శ్రావణ్ కుమార్, ఎస్ఐ2 షాఖాన్, తహసిల్దార్ ఎండి ఖాజా మోహినోద్దీన్, ఎంపీడీవో జయశ్రీ, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి, యుపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ రవికుమార్ పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యం



**విశ్వంభర, భూపాలపల్లి :** వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల వైద్యాధికారిణి డాక్టర్ పోరండ్ల నాగరాణి అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలోని ఇస్సిపేట గ్రామంలో డాక్టర్ నాగరాణి ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రజలకు తగు సూచనలను అందించారు. అనంతరం ఆమె మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యర్థాల సంక్రమణ నిర్వహణ, సురక్షిత త్రాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోకపోతే సీజనల్ వ్యాధుల బారిన పడక తప్పదన్నారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి మీ చుట్టూ పరిసర ప్రాంతాలలో నీటిని నిల్వ ఉంచకుండా చూసుకుంటే దోమల బెడద నుండి తప్పించుకొని సీజనల్ వ్యాధులు సోకకుండా ఆరోగ్యంగా ఉండడానికి ఆస్కారం ఉంటుందన్నారు. నీటి ద్వారా వచ్చే వ్యాధులను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు అధికంగా వచ్చే ప్రమాదం ఉన్నందున ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాలకు వెళ్లొద్దన్నారు. ఫంగస్ ఇన్ఫెక్షన్ నివారణ కోసం కాచి వడబోసిన నీటిని మాత్రమే త్రాగాలని, అలాగే చిన్నపిల్లల పట్ల, వారికి వచ్చే జ్వరాల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నపాటి జ్వరం వచ్చినా ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ గ్రామంలోని కాల్వలలో, ఖాళీ ప్రదేశాల్లో చెత్త చెదారం వేయకుండా ఉండాలన్నారు. అదే విధంగా ఇంటి చుట్టూ డ్రమ్ములు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, కొబ్బరి బొండాలు, పాత కుండలు లాంటి వాటిలో నీరు నిల్వ ఉన్నట్లయితే వాటిని తీసేసి దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని అన్ని గ్రామాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే మండల వైద్యాధికారిణి డాక్టర్ పోరండ్ల నాగరాణి ఆదేశాల మేరకు మండలంలోని ఎల్లారెడ్డి పల్లి గ్రామంలో డాక్టర్ విద్యాసాగర్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 55 మందికి వైద్య పరీక్షలు చేసి ముగ్గురికి రక్త నమూనాలు తీసి ల్యాబ్ కు పంపించడం జరిగిందని, వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్ టెస్టులు చేసి టాబ్లెట్స్ ఇవ్వడం జరిగిందని డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బిక్షపతి, ఏఎన్ఎం సునీత పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండండి





## రానున్న 48 గంటలలో భారీ, అతి భారీ వర్ష సూచన

* విపత్తు నిర్వహణ బృందాలతో సమన్వయం చేసుకోండి
* భద్రతా చర్యల పట్ల ప్రజలను అప్రమత్తం చెయ్యండి
* రిజర్వాయర్లు,కాలువలు, నదులలో నీటి మట్టాలను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలించండి
* స్పిల్ వే లు, వరద గేట్లు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా గమనించండి
* అత్యాయక పరిస్థితులు అధిగమించేందుకు ప్రణాళికలు రూపొందించుకోండి
* ఎప్పటికప్పుడు నీటి మట్టాలు, ప్రవాహం తీరు తెన్నుల సమాచారం సమగ్రంగా తెలుసుకోండి

ఇ.ఎన్.సి అనిల్ కుమార్

రానున్న 48 గంటలలో భారీ, అతి భారీ వర్షాలు కురుస్తున్నాయన్న హైదరాబాద్ వాతావరణ శాఖా (రెడ్‌టెక్‌యాక్షన్) చేసిన సూచనలతో తెలంగాణా రాష్ట్ర నీటి పారుదల శాఖా అప్రమత్తమైంది. ఈ మేరకు రాష్ట్ర నీటి పారుదల శాఖ ఇంజినీర్ జి.అనిల్ కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల శాఖాధికారులతో ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను ఫోన్ లలో సమీక్షించారు. శుక్రవారం ఉదయం నుండి ఆయన ఈ.ఎన్.సీ, సీ.ఈ, యస్.ఈ & ఈ.ఈ లతో మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలపై తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు విపత్తు నిర్వహణ బృందాలతో సమన్వయం చేసుకుంటూనే భద్రతా చర్యల పట్ల ప్రజలను అప్రమత్తం చెయ్యాలన్నారు. రిజర్వాయర్లు, కాలువలు, నీటి మట్టాలను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలిస్తూనే స్పిల్ వే లు, వరద గేట్లు సక్రమంగా పని చేస్తున్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. అత్యాయక పరిస్థితులు ఏర్పడితే ఎటువంటి నష్టం వాటిల్లకుండా అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని అనిల్ కుమార్ ఆదేశించారు. అదే సమయంలో నీటి మట్టాలు, ప్రవాహం ఉధృతి ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారం తెలుసుకోవాలని ఆయన సూచించారు. అంతే గాకుండా అత్యాయక పరిస్థితుల సమాచారం అప్పటికప్పుడే కంట్రోల్ రూమ్ కు అందించాలని ఇ.ఎన్.సి అనిల్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.





## ముదిరాజుల సమస్యలు పరిష్కరించాలి

**విశ్వంభర, నారాయణఖేడ్ :** ముదిరాజుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ముదిరాజ్ మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో పెద్ద శంకరంపేట తహసిల్దార్ గ్రెసి బాయికి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 2009 సంవత్సరంలో ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. అట్టడుగు జీవన ప్రమాణాలతో ఉన్న ముదిరాజులను బీసీ డి నుండి ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు రాజకీయంగా ముదిరాజులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ముదిరాజ్ కి చోటు కల్పించాలన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి తగిన నిధులను కేటాయించాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన ముదిరాజ్ మత్స్యకారులకు ఆసరా పింఛన్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ముదిరాజ్ మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీలో 100% రాయితీ ఇవ్వాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు, పేట మండల అధ్యక్షుడు పల్లెబోయిన పున్నయ్య ముదిరాజ్, బండల శ్రావణ్, పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గాండ్ల సంగమేష్, నాయకులు మాణిక్యం, స్వామి, జోడు రవీందర్, ముదిరాజ్ సంఘం నాయకులు, మర్పల్లి సాయిలు, నిజున రాములు, పలువురు యువకులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, గణపురం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చెల్పూర్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన దారకొండ శంకర్, అనూష దంపతుల కుమారుడు సూర్య తేజ (14) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబానికి బీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలు బుడిగే వసంత శంకర్ 2 వేల రూపాయల ఆర్థిక సహాయంతో పాటు 25 కేజీల బియ్యం అందించి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు.



## రైతుకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

**విశ్వంభర, నారాయణఖేడ్ :** రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆకోవలోనే తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి దేశంలోనే ఏ రాష్ట్రంలో చేయలేని విధంగా ప్రభుత్వం చేసిందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శంకరంపేట్ మండలంలోని బురుగుపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు రుణమాఫీ సంబరాల్లో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ రైతులు ఎడ్ల బండ్లతో నిర్వహించిన ర్యాలీ లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం గ్రామ రైతులు, నాయకులతో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో అన్నదాతకి మంచి రోజులు వచ్చాయని అన్నారు. వరంగల్ సభలో లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాష్ట్ర రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీల్లోని ఒకటైన రుణమాఫీని లక్ష రూపాయల మాఫీతో మొదలు పెట్టారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 లోపు 2 లక్షల రుణమాఫీని చేసి రైతుల భారాన్ని తగ్గిస్తామని అన్నారు. కార్యక్రమంలో శాసన సభ్యులతో పాటు మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్, సంగమేశ్వర్ సెట్, రాజేందర్ గౌడ్, సంతోష్,పెరుమాళ్ గౌడ్, ఎంపీటీసీ రాజు, గోవింద రావు, సాయి రెడ్డి, నరేష్, మాజీ ఎంపీటీసీ సుభాష్ గౌడ్, అనంత్ రావు పాల్గొన్నారు.



## రాఘవపురం లో ఉచిత వైద్య శిబిరం

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆశ జ్యోతి ఆధ్వర్యంలో రాఘవపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 110 మందిని పరీక్షించగా ముగ్గురికి రక్త నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశాజ్యోతి మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాలలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని అదేవిధంగా ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాలని మీ ఇంటి చుట్టుపక్కల ఉన్న టైర్లు, కూలర్లు, డ్రమ్ముల్లో నీటిను పారపోయాలని ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో చిట్యాల సబ్ యూనిట్ ఆఫీసర్ అలిం, హెచ్.ఈ.ఓ జమలుద్దీన్, హెచ్ వీ విజయ, హెల్త్ అసిస్టెంట్ కె.వి.కృష్ణారెడ్డి, ఏఎన్ఎం రాజేశ్వరి, రేణుక ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, శ్రావణి, మానస, రాజమణి, అనిత గ్రామ కారోబార్ రాజిరెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ మహంకాళి అమ్మవారి 116 వ వార్షికోత్సవాలు



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ పాతబస్తీ లోని లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి అమ్మవారి 116 వ వార్షికోత్సవాలు హైదరాబాద్ నగర కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహర, చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, శిఖర పూజ, ధ్వజారోహన చేసిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల కోఆర్డినేషన్ తో బోనాల పండుగ ప్రశాంతంగా నిర్వహిస్తామని. హైదరాబాద్ బోనాల పండుగ కు వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## రెండు లక్షల రుణమాఫీ చారిత్రాత్మకం

**విశ్వంభర భూపాలపల్లి :** ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడం దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ అంశమని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి జిల్లా నాయకుడు పోలినేని లింగారావు అన్నారు. శుక్రవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అన్నారు. రాహుల్ గాంధీ వరంగల్ రైతు సంఘర్షణ సభలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు రైతులందరూ బ్యాంకులకు వెళ్లి రెండు లక్షల రూపాయల వరకు రుణాలు తీసుకోండని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని, రైతు రుణాలు మాఫీ చేస్తుందని భరోసానిచ్చిన విషయాన్ని లింగారావు గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం నేడు ప్రజా ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. లక్షలోపు రుణాలున్న 11.50 లక్షల మంది రైతుల రుణ ఖాతాల్లో ప్రభుత్వం నేరుగా నగదు జమ చేసిందని, ఆగస్టు 15లోగా 2 లక్షల లోపు ఉన్న రైతుల రుణాలు మాఫీ చేస్తుందని చెప్పారు. హస్తం బంధువులంతా అన్నదాత బంధువులై రుణమాఫీ పండుగను జరుపుకోవాలన్నారు.





## అక్కన్న మాదన్న మహంకాళి బోనాల ఉత్సవాలు

**విశ్వంభర, హైదరాబాద్:** హరిబౌలిలోని చరిత్రాత్మకమైన శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో 76వ బోనాల ఉత్సవాలు అంగ రంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం తెలంగాణ తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా ధ్వజారోహణ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నాని తెలిపారు. మాతృమూర్తులచే ఆషాఢ మాస రెండో వారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమము అక్కన్న మాదన్న ప్రార్థన మందిరంలో ఘనంగా జరిగింది. అనంతం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## కరెంట్ బిల్లు చెల్లించాలన్నందుకు అధికారిపై దాడి



**విశ్వంభర, మోతీనగర్:** హైదరాబాద్‌లో కరెంట్ బిల్లులు వసూలు చేయడం విద్యుత్ శాఖ ఉద్యోగులకు ప్రాణసంకటంగా మారింది. గతంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నందుకు దాడి చేసిన ఘటనలు ఎన్నో చూశాం.. తాజాగా.. కరెంట్ బిల్లు కట్టలేదని నిలదీసినందుకు ఉద్యోగిపై ఓ యువకుడు దాడి చేశాడు.. ఈ ఘటన హైదరాబాద్ మోతీనగర్ పరిధిలో చోటుచేసుకుంది.. వెంకటస్వామి అనే వ్యక్తికి సంబంధించిన కరెంటు బిల్లు దాదాపు 6 వేల 800 బకాయి ఉంది. దీంతో వెస్ట్ జోన్ సర్కిల్లో విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించాలంటూ లైన్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ వెంకటస్వామి ఇంటికెళ్లి కోరాడు.. ఈ విషయంపై లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌కి.. వెంకటస్వామి కుటుంబ సభ్యులకు మధ్య వాగ్వాదం జరిగింది. బిల్లు కట్టని కారణంగా కరెంట్ కట్ చేస్తామని చెప్పడంతో కోపంతో ఊగిపోయిన వెంకటస్వామి కుమారుడు లైన్ ఇన్‌స్పెక్టర్‌పై దాడి చేశాడు. యువకుడు కొట్టడంతో శ్రీకాంత్ గాయపడ్డాడు.

## ఘనంగా రుక్మిణి విఠలేశ్వర కళ్యాణం



**విశ్వంభర నారాయణఖేడ్:** ఆషాడమాస ఉత్సవాలలో భాగంగా పెద్ద శంకరంపేటలోని విఠలేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీ రుక్మిణి విఠలేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేకంగా అలంకరించిన పూల పందిరిలో స్వామివారి కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామివారికి అధిక సంఖ్యలో మహిళలు ఒడిబియ్యం సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు, ప్రజలు కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామ పెద్దలు, మురళీ పంతులు, కిష్టారెడ్డి, వెంకటేశం. శ్రీహరి. మల్గొండ చంద్రశేఖర్. సాయిరాం. రాము. కరణం దాసు. రాజేష్. ప్రవీణ్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సుకి తప్పిన పెను ప్రమాదం



**విశ్వంభర, ఆత్మకూరు-(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలంలో శుక్రవారం వలిగొండ మండలం దుప్పల్లి గ్రామ శివారులో సెయింట్ ఆన్స్ స్కూల్ బస్సు స్టీరింగ్ రాడ్ విరిగి బస్సు రోడ్డు పక్కకు దూసుకువెళ్ళింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న విద్యార్థులకు ప్రమాదం జరగలేదు. చిన్నారులు ఈ ప్రమాదంలో సురక్షితంగా బయట పడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## పోలీసులను కించపరిచేలా టాటూ..

# ఎఫ్ఐఆర్ నమోదు




**విశ్వంభర, ఢిల్లీ:** సాధారణంగా చాలా మంది టాటూలు వేసుకుంటారు. కొంత మంది అద్భుతంగా వేసుకుంటే.. మరికొందరూ వివాదాలు సృష్టిస్తుంటారు. తాజాగా ఓ టాటూ ఆర్టిస్ట్ ని ఇబ్బందుల్లోకి నెట్టింది. ఛాతి పై పచ్చ బొట్టు వేసి దానిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. ఈ టాటూ పోలీసులను కించపరిచేలా ఉందని విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో పోలీసులు రంగంలోకి దిగి సుమోటోగా కళాకారుడి పై కేసు నమోదు చేశారు. ఓ కళాకారుడు.. విదేశీయుడి ఛాతీపై 'F**k the police' టాటూ వేశాడు. దీన్ని ఇన్స్టాగ్రామ్లో పోస్టు చేశాడు. నెట్టింట వైరల్గా మారింది. ఈ పచ్చబొట్టుపై నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పోలీస్ వ్యవస్థను కించపరిచేలా ఉందని విమర్శలు వెల్లువెత్తాయి. ఆ ఫొటోను పోలీసులకు లింక్ చేస్తూ షేర్ చేశారు. మేజిస్ట్రేట్ ఆదేశాలతో పోలీసులు సుమోటాగా తీసుకుని కళాకారుడిపై కేసు నమోదు చేశారు. టాటూను చూసిన పోలీసులు కూడా విస్మయానికి గురయ్యారు. పోలీసుల్ని కించపరిచేలా ఉందని.. ఉద్దేశపూర్వకంగానే అవమానించినట్లుగా ఉందని పోలీసులు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉందని తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అప్పటివరకు అస్సాం ముస్లిం మెజారిటీగా మారుతుంది:సీఎం హిమంత బిశ్వ సర్మ



**విశ్వంభర, అస్సాం :** రాష్ట్రంలో పెరుగుతున్న ముస్లిం జనాభాపై ముఖ్యమంత్రి హిమంత బిశ్వ సర్మ ఆందోళన వ్యక్తం చేశారు. 2041 నాటికి రాష్ట్రం ముస్లిం మెజారిటీగా మారుతుందని, ఇది పచ్చినిజమని శుక్రవారం ఆయన తెలిపారు. రాష్ట్రంలో ముస్లిం జనాభా ప్రతీ 10 సంవత్సరాలకు 30 శాతం పెరుగుతోందని, 2041 నాటికి వారే మెజారిటీ అవుతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గౌహతిలో జరిగిన విలేకరులు సమావేశంలో ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. అస్సాం జనాభాలో ముస్లింలు 40 శాతంగా ఉన్నారని, దీనిని ఎవరూ ఆపలేరని తెలిపారు. బుధవారం రోజు కూడా ఆయన రాష్ట్రంలో ముస్లిం జనాభా పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇలా ముస్లిం జనాభా విపరీతంగా పెరగడం ఆందోళన కలిగిస్తోందని, ముస్లిం జనాభా అనేది రాజకీయ విషయం కాదని, ఇది 'జీవన్మరణ' సమస్య అంటూ ముఖ్యమంత్రి హిమంత బిశ్వ సర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో జనాభా వైవిధ్యం మారడం నాకు పెద్ద సమస్య అని,1951లో 12 శాతం ఉన్న ముస్లింలు ఇప్పుడు 40 శాతానికి చేరుకున్నారని, దీని వల్ల తాము చాలా జిల్లాలను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

## 'షాడో కేబినెట్' ఏర్పాటు చేసిన నవీన్ పట్నాయక్!



**విశ్వంభర, ఒడిశా:** ఒడిశా రాజకీయాల్లో ఆసక్తికర సంఘటన! మాజీ ముఖ్యమంత్రి, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ 'షాడో కేబినెట్ 'ను ఏర్పాటు చేశారు. బీజేపీ ప్రభుత్వం పనితీరును పరిశీలించేందుకు ఆయన ఈ కేబినెట్ను ఏర్పాటు చేశారు. పార్టీకి చెందిన 50 మంది ఎమ్మెల్యేలకు ఒక్కో శాఖను అప్పగించారు. ప్రభుత్వం పనితీరుపై షాడో కేబినెట్ను ఏర్పాటు చేయడం దేశంలోనే తొలిసారి. ఒడిశాలో బీజేడీ సుదీర్ఘకాలం పాలన చేసింది. మోహన్ మాంఝీ నేతృత్వంలో ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఆర్థికశాఖ మాజీ మంత్రి ప్రసన్న ఆచార్యకు ఆర్థిక శాఖ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. పరిపాలన, ప్రజా ఫిర్యాదులను ప్రతాప్ దేబ్ పర్యవేక్షిస్తారు. మాజీ మంత్రి నిరంజన్ పూజారి గృహ, ఆహారం, వినియోగదారుల సంక్షేమ శాఖలను పర్యవేక్షిస్తారు. షాడో మంత్రివర్గానికి సంబంధించిన ఒక ఉత్తర్వును బీజేడీ జారీ చేసింది. షాడో కేబినెట్ బాధ్యతలు కలిగిన వారు ప్రభుత్వంలోని ఆయా శాఖల నిర్ణయాలను, విధానాలను నిశితంగా పరిశీలిస్తారు. ఇదేమీ ప్రభుత్వ అధికారిక సంస్థ కాదు. ఎలాంటి అధికారాలు ఉండవు. కేవలం మంత్రివర్గాన్ని ప్రతిపక్షంగా పర్యవేక్షించేందుకు ఈ షాడో కేబినెట్ను ఏర్పాటు చేశారు.


## వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ పై ఎఫ్ఐఆర్



**విశ్వంభర, ఢిల్లీ:** వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేద్కర్ పై ఢిల్లీ పోలీసులు తాజాగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఫోర్జరీ, చీటింగ్, ఐటీ చట్టం, దివ్యాంగ చట్టం కింద పూజా ఖేద్కర్ పై కేసు నమోదు చేశారు. యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. నకిలీ గుర్తింపు పత్రాలు సమర్పించి పరిమితికి మించి పరీక్షలు రాశారని ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు. పూజా ఖేద్కర్ 2023 బ్యాచ్ మహారాష్ట్ర క్యాడర్ ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి. పూణే కలెక్టర్ కార్యాలయంలో ట్రైనీగా విధులు నిర్వహిస్తూ, తనకు ప్రత్యేక అధికారాలు, సదుపాయాలు కావాలంటూ డిమాండ్ చేయడంతో పాటు, సొంతంగా పలు ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. దాంతో ఆమె వ్యవహారంపై మహారాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. అయితే, తవ్వేకొద్దీ అనేక సంగతులు బయటపడగా, చివరికి పోలీసు కేసు కూడా నమోదైంది. తనకు లోకోమోటార్ వైకల్యం ఉన్నట్టు తీసుకున్న సర్టిఫికెట్, పర్సన్ విత్ బెంచ్ మార్క్ డిజెబిలిటీస్ (అంగవైకల్య నిర్ధారణ) సర్టిఫికెట్ ను ఆమె గతంలో యూపీఎస్సీకి సమర్పించగా, అవి ఫేక్ అని తాజాగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

# మైక్రోసాఫ్ట్ సేవలకు అంతరాయం

- ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకులు, విమానయాన, టెలికాం రంగాలపై తీవ్ర ప్రభావం
- శంషాబాద్లో నిలిచిపోయిన 35 విమాన సర్వీసులు
- ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్ జెట్ విమాన సంస్థల సేవలు




### శంషాబాద్ ఎయిర్పోర్టుపైనా ప్రభావం

మైక్రోసాఫ్ట్ 365 యాప్స్ సేవల్లో సాంకేతిక సమస్య ప్రభావం శంషాబాద్ ఎయిర్పోర్టుపైనా పడింది. ఇప్పటివరకు 35 విమాన సర్వీసులను ఎయిర్పోర్టు అధికారులు రద్దు చేశారు. ఎయిర్పోర్టులో డిస్ప్లే బోర్డులు పనిచేయకపోవడంతో మాన్యువల్ బోర్డులు ఏర్పాటు చేశారు.

**విశ్వంభర, ఢిల్లీ:** ప్రపంచ వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ సేవలకు అంతరాయం ఏర్పడింది. మైక్రోసాఫ్ట్ 365 యాప్స్ సేవల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకులు, విమానయాన సంస్థలు, టెలికాం, మీడియాసహా అనేక రంగాలపై తీవ్ర ప్రభావం చూపింది. లండన్ స్టాక్ ఎక్స్చేంజ్లో సేవలు నిలిచిపోగా.. అమెరికాలో ఎమర్జెన్సీ సేవల నెంబర్ 911పై ప్రభావం పడింది. భారత్లో విమాన, ఐటీ సేవలకు అంతరాయం ఏర్పడింది. దీనికితోడు ప్రసారాలు జరుగుతుండగా స్కై న్యూస్ మధ్యలో నిలిచిపోయింది. ఢిల్లీ విమానాశ్రయంలో విమాన సేవలకు అంతరాయం ఏర్పడింది. ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్ జెట్ తదితర విమాన సంస్థల సేవలకు విఘాతం ఏర్పడింది. మైక్రోసాఫ్ట్ సేవల్లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా అత్యధికంగా ఆస్ట్రేలియాలో వివిధ రంగాలు ప్రభావితమయ్యాయి. దీంతో ఆస్ట్రేలియా ప్రభుత్వం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆస్ట్రేలియాలో పలు న్యూస్ ఛానెళ్ల ప్రసారాలు నిలిచిపోయాయి. ప్రపంచ వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ సేవలకు అంతరాయం ఏర్పడింది. మైక్రోసాఫ్ట్ 365 యాప్స్ సేవల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకులు, విమానయాన సంస్థలు, టెలికాం, మీడియాసహా అనేక రంగాలపై తీవ్ర ప్రభావం చూపింది. లండన్ స్టాక్ ఎక్స్చేంజ్లో సేవలు నిలిచిపోగా.. అమెరికాలో ఎమర్జెన్సీ సేవల నెంబర్ 911పై ప్రభావం పడింది. భారత్లో విమాన, ఐటీ సేవలకు అంతరాయం ఏర్పడింది. దీనికితోడు ప్రసారాలు జరుగుతుండగా స్కై న్యూస్ మధ్యలో నిలిచిపోయింది. ఢిల్లీ విమానాశ్రయంలో విమాన సేవలకు అంతరాయం ఏర్పడింది. ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్ జెట్ తదితర విమాన సంస్థల సేవలకు విఘాతం ఏర్పడింది. మైక్రోసాఫ్ట్ సేవల్లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా అత్యధికంగా ఆస్ట్రేలియాలో వివిధ రంగాలు ప్రభావితమయ్యాయి. దీంతో ఆస్ట్రేలియా ప్రభుత్వం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆస్ట్రేలియాలో పలు న్యూస్ ఛానెళ్ల ప్రసారాలు నిలిచిపోయాయి.

**క్రౌడ్ స్ట్రైక్ అప్డేట్ కారణంగానే..**

క్రౌడ్ స్ట్రైక్ అప్డేట్ కారణంగా ఈ రకమైన సమస్య ఎదురవుతున్నట్లు మైక్రోసాఫ్ట్ తెలిపింది. మైక్రోసాఫ్ట్ 365 యాప్స్, సర్వీస్సుల్లో తలెత్తిన సమస్యను పరిష్కరిస్తున్నామని పోస్టు చేసింది. ఈ ప్రయత్నంలో పురోగతి కనిపిస్తోందని తెలిపింది. అయితే, ఈ సమస్య పరిష్కారానికి 5 నుంచి 10 గంటల సమయం పట్టవచ్చని సమాచారం. ప్రపంచ వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ విండోస్ వినియోగదారులు ఆపరేటింగ్ సిస్టమ్ లో లోపాలను ఎదుర్కొంటున్నారు. మిలియన్ల మంది విండోస్ యూజర్లు బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ (BSOD) ఎర్రర్ అని వస్తుంది. దీని కారణంగా సిస్టమ్ లు అకస్మాత్తుగా షెడ్ డౌన్ కానీ, రీస్టార్ట్ అవుతున్నాయి. యూజర్లు ఎక్స్ వేదికగా ఈ సమస్యను తెలియజేస్తూ పోస్టులు పెడుతున్నారు.

**మైక్రోసాఫ్ట్ అధికారులతో భారత ప్రభుత్వం సంప్రదింపులు**

ఐటీ శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ అధికారుల నుంచి పూర్తి సమాచారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైక్రోసాఫ్ట్, దాని భాగస్వాములతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. అంతరాయానికి కారణం కనుగొన్నారని, సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (NIC) నెట్వర్క్పై ప్రభావం చూపలేదని అన్నారు. మైక్రోసాఫ్ట్ సాంకేతిక సమస్య ప్రభావం SBI పై లేదని ఎస్బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా తెలిపారు.

**మైక్రోసాఫ్ట్ సర్వర్ డౌన్ కారణంగా..**

ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ ప్రభావితమైన దేశాల్లో అమెరికా, బ్రిటన్, సింగపూర్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఉన్నాయి. విమానాశ్రయం, రైల్వే, బ్యాంకింగ్, స్టాక్ మార్కెట్, టీవీ ఛానెల్స్, ఆన్ లైన్ దుకాణాలు, ఆసుపత్రులు, ఐటీ రంగాల్లో మైక్రోసాఫ్ట్ సర్వర్ డౌన్ ప్రభావం ఎక్కువగా ఉంది.

### లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్పై ప్రభావం

మైక్రోసాఫ్ట్ సర్వర్లు డౌన్ కావడంతో లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్పై కూడా ప్రభావం చూపింది. నెదర్లాండ్స్లో విమాన సర్వీసులు అంతరాయం ఏర్పడింది. మైక్రోసాఫ్ట్ సర్వర్ డౌన్ కారణంగా అమెరికాలో 200 కంటే ఎక్కువ విమానాలు రద్దు చేయబడ్డాయి.జర్మనీలో బ్యాంకింగ్, టెలికాం, ఎయిర్ లైన్స్ సేవలు నిలిచిపోయాయి. దక్షిణాఫ్రికాలోని అతిపెద్ద బ్యాంక్ కాపిటెక్ కూడా ఈ సమస్యతో ప్రభావితమైంది. ప్రపంచంలో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాల్లో ఒకటైన సింగపూర్ లోని చాంగి విమానాశ్రయం కూడా ప్రభావితమైంది. బ్రిటన్, జర్మనీలోని ఆసుపత్రులు కూడా ప్రభావితమయ్యాయి.

## చిన్న సమస్య వచ్చింది.. విమాన సేవలకు అంతరాయంపై రామ్మోహన్ నాయుడు



**విశ్వంభర, విశాఖపట్నం:** ప్రపంచ వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ సేవలకు అంతరాయం కలుగుతుండడతో భారత్లో విమాన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై పౌర విమానాల శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ.. ఎయిర్వేస్కి సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్కి సంబంధించిన అజూర్ అనే క్లౌడ్ సాఫ్ట్వేర్లో చిన్న సమస్య వచ్చిందని అన్నారు. దీంతో ప్రధానంగా అమెరికాలో సమస్య అధికంగా వస్తుందని చెప్పారు. ఇదే విషయమై తమ కార్యదర్శితో మాట్లాడానని తెలిపారు. మన దేశంలో టెక్నికల్ సాఫ్ట్వేర్ సిస్టం నుంచి మాన్యువల్ సిస్టంలోకి మూవ్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుతానికి భారత్లో దానికి సంబంధించి సమస్య ఏదీ లేదని తెలిపారు. ప్రయాణికులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మాన్యువల్ పద్ధతులలో ఆపరేషన్స్ నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. ఎయిర్ లైన్స్, అథారిటీ ఆఫ్ ఇండియా సమన్వయంతో పని చేస్తూ ప్రయాణికులకు సేవలందించాలని అన్నారు. విమానాల ఆలస్యం వల్ల నిలిచిపోయిన ప్రయాణికులకు సీట్లు, ఆహారం, నీరు అందించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు కమ్యూనికేషన్ మెరుగుపరచాలని తెలిపారు. ప్రయాణికుల సేవకు అదనపు సిబ్బందిని ఉపయోగించాలని చెప్పారు. మైక్రోసాఫ్ట్ నిపుణులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**విశాఖ విమానాశ్రయంలో..**

విశాఖలో విమానాల ఆపరేషన్లో తలెత్తిన ఇబ్బందులను పరిష్కరించేందుకు సిబ్బంది పనిచేస్తున్నారు. మాన్యువల్గా బోర్డింగ్ క్లియర్ చేస్తున్నారు. సాంకేతిక కారణాలతో జాప్యం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణీకుల రద్దీ బాగా పెరిగింది.

## మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయంపై ఆనంద్ మహీంద్ర ఫన్నీ ట్వీట్



విశ్వంభర, ముంబై: మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయంపై మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. ఇప్పుడు ప్రపంచ వాణిజ్య కార్యకలాపాల గమనం ఈ విధంగా ఉందంటూ ఆయన రెండు ఎద్దులు ఉన్న ఫొటోను పోస్ట్ చేశారు. వాటిపై ఇద్దరు భద్రతా సిబ్బంది ప్రయాణిస్తున్నట్లు ఉంది. ఆనంద్ మహీంద్ర చేసిన ఈ ఫన్నీ పోస్ట్ పై నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. మైక్రోసాఫ్ట్ విండోస్ సర్వీస్కు అంతరాయంతో ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది ఎన్నో రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఎద్దులను స్టాక్ మార్కెట్ కు సూచకంగా వాడతారు. వాణిజ్య, వ్యాపారాలు మంద గమనంతో ముందుకు సాగుతున్నాయి. బ్యాంకింగ్ సేవలపై కూడా దీని ప్రభావం పడింది. మళ్లీ మనం పాత రోజులకు వెళ్తే బాగుంటుందని కొందరు నెటిజన్లు ఆనంద్ మహీంద్ర పోస్ట్ పై కామెంట్లు చేస్తున్నారు. 'అద్భుతమైన పెట్రోలింగ్ వాహనం' అని ఓ నెటిజన్ పేర్కొన్నాడు. అన్ని కంపెనీలు మైక్రోసాఫ్ట్ టెక్నాలజీ పై బాగా ఆధారపడుతున్నాయి. దానికి ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేసుకోలేదు. దీంతో సమస్యలు తప్పట్లేదు. సమస్యను పరిష్కరించేందుకు మైక్రోసాఫ్ట్ కృషి చేస్తోంది. ఈ సమస్య పూర్తిగా ఎప్పుడు తొలగిపోతుందో ఎవరికీ తెలియదు. అప్పటి వరకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందేనా అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

## 10 బ్యాంకులపై మైక్రోసాఫ్ట్ విండోస్ ప్రభావం: ప్రకటించిన ఆర్బీఐ





**విశ్వంభర, ముంబై:** మైక్రోసాఫ్ట్ విండోస్లో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా మన దేశంలో 10 బ్యాంకులు, ఎన్బీఎఫ్సీలపై స్వల్ప ప్రభావం పడిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే ఇది కేవలం స్వల్ప అంతరాయమేనని తెలిపింది. వాటిలో కొన్నిటిని ఇప్పటికే పరిష్కరించినట్లు వెల్లడించింది. చాలా బ్యాంకుల కీలక వ్యవస్థలు క్లౌడ్లో లేవని ఆర్బీఐ పేర్కొంది. కొన్ని బ్యాంకులు మాత్రమే ఈ సేవలను వినియోగిస్తున్నట్లు తెలిపింది. విండోస్ అంతరాయం కారణంగా మన దేశంలో బ్యాంకింగ్ సేవల్లో, విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది.



## కన్వర్ యాత్రపై సీఎం యోగి ఆదిత్యనాథ్ వివాదాస్పద ఆదేశాలు

**విశ్వంభర, ఉత్తరప్రదేశ్ :** సాధారణంగా ప్రతీ ఏడాది లక్షలాది మంది శివభక్తులు పాల్గొనే 'కన్వర్ యాత్ర' రూటులో తినుబండారాలకు సంబంధించి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం ఇచ్చిన ఆదేశాలు వివాదాస్పదంగా మారాయి. తినుబండారాల దుకాణాల వద్ద యజమానులు, సిబ్బంది పేర్లు తప్పనిసరిగా ఉండాలని సీఎం ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాలపై విపక్షాల నుంచే కాకుండా అధికార ఎన్డీయే భాగస్వాముల నుంచి కూడా విమర్శలు వెల్లువెత్తాయి. ఇలాంటి ఆదేశాల వల్ల మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు కన్వర్ యాత్రకు వెళ్లే మార్గంలోని దుకాణాలపై యజమానులు, సిబ్బంది పేర్లు ప్రదర్శించాలని అనడం, మాంసం అమ్మకాలు నిషేధించడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షురాలు మాయావతి విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రయోజనాల కోసమే యూపీ సర్కార్ ఈ ఆదేశాలిచ్చిందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆమె ట్వీట్ చేశారు. ఈ చర్య ఆర్థికంగా ఒక వర్గం ప్రజలను బాయ్కాట్ చేయడమేనని, ఇది గర్హనీయమని అన్నారు.

## నేర విచారణ నుంచి గవర్నర్లకు రక్షణ నిబంధనపై సుప్రీం కీలక నిర్ణయం



**విశ్వంభర, ఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ గవర్నర్పై ఇటీవల ఓ మహిళ లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ నేపథ్యంలో నేర విచారణ నుంచి గవర్నర్లకు రక్షణపై అత్యున్నత న్యాయస్థానం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. నేర విచారణ నుంచి గవర్నర్కు మినహాయింపు కల్పించే ఆర్టికల్ 361 రాజ్యాంగ నిబంధనను పరిశీలించేందుకు అంగీకారం తెలిపింది. బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ తనను లైంగిక వేధింపులకు గురి చేశారంటూ అక్కడి రాజ్భవన్లో తాత్కాలిక సిబ్బందిగా పని చేస్తున్న ఓ మహిళ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన బాధిత మహిళ.. గవర్నర్లకు రక్షణ కల్పించే రాజ్యాంగంలోని 361వ అధికరణపై న్యాయ సమీక్ష చేయాలని అభ్యర్థించారు. నేర విచారణ నుంచి మినహాయింపు ఇచ్చే విషయంలో నిర్దిష్ట మార్గదర్శకాలను రూపొందించేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం అంగీకరించింది.. దీనిపై తమ స్పందన తెలియజేయాలంటూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.



## గత ప్రభుత్వ మద్యం అక్రమాలపై సీఐడీ దర్యాప్తు

**విశ్వంభర, మంగళగిరి:** గత ప్రభుత్వ మద్యం అక్రమాలపై సీఐడీ ముమ్మరంగా దర్యాప్తు చేస్తుంది.ఏపీబీసీఎస్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి అక్రమాలపై సీఐడీ కూపి లాగుతుంది.ఎక్సైజ్ శాఖలో జరిగిన అవకతవకలు.. అక్రమాలు జరిగిన తీరుపై నాటి ఉన్నతాధికారుల నుంచి సీఐడీ వివరాలు తీసుకుంటుంది. వాసుదేవరెడ్డి పాత్రపై వెలుగులోకి వస్తున్న సంచలన వాస్తవాలు. ఏపీబీసీఎల్ ఎండీతో పాటు, డిస్టలరీల కమిషనర్ గానూ వాసుదేవ రెడ్డికే జగన్ ప్రభుత్వం బాధ్యతలు కట్టబెట్టింది. ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కమిషనర్లకు ఫైళ్లు పంపకుండా నిర్ణయాలు తీసుకునేలా వాసుదేవ రెడ్డికే అధికారాలు ఇచ్చింది.ట్రాన్స్‌ఫర్లు చేయించేస్తానంటూ ఉన్నతాధికారులను బెదిరించారని వాసుదేవరెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి.మద్యం కొనుగోళ్లలోనూ భారీగా అవకతవకలకు తెరలేపిన వాసుదేవ రెడ్డి..ఒకే బ్రాండ్ మద్యాన్ని తెలంగాణ కంటే అధిక ధరకు కొనుగోలు చేసినట్టు విచారణలో వెల్లడైంది.ఒక్క వాసుదేవ రెడ్డి అవినీతే లెక్కలకు అందటం లేదని,బినామీ పేర్లతో కొన్ని డిస్టిలరీల్లోకి ఆయన చోరబడ్డారు.కొన్ని మద్యం బ్రాండ్లను రాత్రికి రాత్రే తప్పించినట్లు తెలుస్తోంది. తక్కువ రేటు ఉన్న మద్యం బ్రాండ్లను గణనీయంగా జగన్ ప్రభుత్వం తగ్గించింది.20142019 మధ్యలో తక్కువ రేటు ఉన్న మద్యం బ్రాండ్ లు32 అందుబాటులో ఉంటే వాటిని రెండు బ్రాండ్లకే జగన్ ప్రభుత్వం కుదించింది.వాటిని అధిక ధరల కు విక్రయించి సొమ్ము చేసుకొని ప్రముఖ బ్రాండ్ల పేర్లతో పోలిన పేర్లు వచ్చేలా సొంత బ్రాండ్లను ప్రవేశపెట్టింది. సొంత బ్రాండ్ల మద్యానికి అధిక ధరల ఎమ్మార్పీల నిర్ధారించింది.సబ్ లీజులు పేరుతో డిస్టిలరీలను జగన్ సన్నిహితులు కైవసం చేసుకున్నారు.11 డిస్టిలరీలను జగన్ అనుచరులు హస్తగతం చేసుకున్నట్టు సీఐడీ విచారణలో వెల్లడైంది.హస్తగతం చేసుకున్న డిస్టిలరీల నుంచే 65 శాతం మేర మద్యాన్ని ఏపీలో కొనుగోళ్లకు వాసుదేవరెడ్డి అనుమతి ఇచ్చారు.201419 మధ్య కాలం లో ఉన్న టాప్ 5 మద్యం బ్రాండ్ మద్యాన్ని 2019 తర్వాత కొనుగోళ్లు నిలిపివేశారు.మద్యం నుంచి భవిష్యత్ నుంచి వచ్చే ఆదాయాన్ని తాకట్టు పెట్టిన జగన్ ప్రభుత్వం మద్యం ఆదాయాన్ని ఏపీఎస్డీసీకి రూ. 14,276 కోట్లు మళ్లించినట్టు గుర్తించారు.

## ఏపీలో షూటింగ్ చేయడంపై హీరో సుమన్ సంచలన వ్యాఖ్యలు



**విశ్వంభర, విశాఖపట్నం :** ఏపీలో షూటింగ్ చేయడంపై హీరో సుమన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిసిన హీరో సుమన్...అనంతరం మాట్లాడారు. ఎన్నికల రిజల్ట్ తరువాత అందరూ బిజీగా ఉన్నారని ఇప్పటి వరకూ ఎవ్వరిని కలవలేదు...రేపు ప్రోగ్రాం ఉంది.. అందుకే ఒక రోజు ముందు వచ్చి అందర్ని కర్టసీగా కలుస్తున్నానని తెలిపారు. ఏపిలో అవకాశం కల్పించడం, స్టూడియోలు కట్టడం మాత్రమే కాదు... ఈ రోజుల్లో చిన్న సినిమాలు ఆడాలంటే లోకేషన్లు బాగా ఉండాలని తెలిపారు. పెద్ద సినిమాలు 20శాతం మాత్రమే ఏపీలో తీసి మిగిలినవి విదేశీ లోకేషన్లలో తీస్తున్నారు...తమిళ, మళయాళ సినిమాలు రాసే కథల్లో స్వేచ్ఛ ఉంటుంది...వారు ఎక్కడికైనా వెళ్లి సినిమాలు తీస్తారని వివరించారు. హైదరాబాద్ కు ఇండస్ట్రీ రావాలని ఇక్కడే సినిమాలు తీయాలని 20 శాతం బయట తీయాలని అప్పట్లో రూల్ పెట్టారని... ఇక్కడి లోకేషన్లన్ని ఇప్పటికే తీసేసాం.. ప్రేక్షకులు కొత్త లోకేషన్లు ఉంటే తప్ప సినిమాలను ఆదరించడం లేదని వెల్లడించారు. పెద్ద సినిమాలకు సెట్స్ వేయడానికి డబ్బు ఉంది.. చిన్న సినిమాలకు అది సాధ్యం కాదు.... తెలుగు సినిమాలు సక్సెస్ అయితే అవి కూడా డబ్బింగ్ అవుతాయన్నారు. లోకేషన్ల విషయంలో కండిషన్లు వద్దు, చిన్న సినిమాలకు మరింత ఫ్రీడం ఇవ్వాలని కోరారు.

## ఈ నెల 22 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు




**విశ్వంభర, విజయవాడ:** ఈ నెల 22 నుంచి ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఐదు రోజుల పాటు ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. తొలి రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ ప్రసంగించనున్నారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ఈ అసెంబ్లీ సెషన్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.పూర్తి స్థాయి బడ్జెట్‌ను అక్టోబర్‌లో ప్రవేశ పెట్టే యోచనలో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. వీటితో పాటు శ్వేతపత్రాలపై కూడా అసెంబ్లీలో చర్చించనున్నారు. ఈ నెల 23న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లును సభలో ప్రవేశపెట్టనున్నారు.

## జగన్‌కు బుల్లెట్ ప్రూఫ్ వాహనం తొలగింపు



**విశ్వంభర, కడప:** వర్షాలు కురుస్తునందున రోడ్డు మార్గాన వినుకొండ బయలుదేరారు జగన్. అయితే.. ఈ తరుణంలోనే... వై ఎస్ జగన్ వెంట పార్టీ నేతలు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు పోలీసులు. వై ఎస్ జగన్ తో పాటు వినుకొండ బయలుదేరారు మాజీ మంత్రులు, ఎంపీలు,.ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు. ఎక్కడికక్కడ నేతల కార్లు వై ఎస్ జగన్ వెంట వెళ్లకుండా నియంత్రిస్తున్నారు పోలీసులు. తాడేపల్లి, మంగళగిరి, గుంటూరు లో పార్టీ నేతల వాహనాలు ఆపేపారు పోలీసులు. ఇన్నాళ్లు ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని తొలగించారు పోలీసులు. సరిగ్గా నడవని బీపీ వాహనం ఇచ్చారు పోలీసులు. వాహనం బాగోకపోవడం తో ప్రయివేటు వాహనం లో వినుకొండ వెళ్తున్నారు వై ఎస్ జగన్. పోలీసులు తీరుపై మండి పడుతున్నారు వై ఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. కాగా, బుధవారం రాత్రి హత్యకు గురైన వైసీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని ఆయన పరామర్శించనున్నారు.

# 45 రోజుల్లో 36 రాజకీయ హత్యలు జరిగాయి!

### ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాలి
### మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డిమాండ్



**విశ్వంభర, వినుగొండ:** వైసీపీ కార్యకర్తలపై వరుస దాడుల వ్యవహారంపై మాజీ సీఎం జగన్ తీవ్రంగా స్పందించారు. ఏపీ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు లక్ష్యంగా నిప్పులు చెరిగారు. 45 రోజుల కూటమి పాలనలో రాష్ట్రంలో 36 రాజకీయ హత్యలు, 300 హత్యాయత్నాలు జరిగాయని జగన్ సంచలన ఆరోపణలు చేశారు. వైసీపీ కార్యకర్తలపై దాడులకు నిరసనగా ఢిల్లీలో ధర్నా చేస్తామని చెప్పారు. ఏపీలో లా అండ్ ఆర్డర్ లేదన్న జగన్.. రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వైసీపీ కార్యకర్తలపై వరుస దాడుల వ్యవహారంపై మాజీ సీఎం జగన్ తీవ్రంగా స్పందించారు. ఏపీ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు లక్ష్యంగా నిప్పులు చెరిగారు. 45 రోజుల కూటమి పాలనలో రాష్ట్రంలో 36 రాజకీయ హత్యలు, 300 హత్యాయత్నాలు జరిగాయని జగన్ సంచలన ఆరోపణలు చేశారు. వైసీపీ కార్యకర్తలపై దాడులకు నిరసనగా ఢిల్లీలో ధర్నా చేస్తామని చెప్పారు. ఏపీలో లా అండ్ ఆర్డర్ లేదన్న జగన్.. రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుంటాం. బుధవారం ఢిల్లీలో ధర్నా చేస్తాం. రాష్ట్రంలో అరాచకాలు దేశం మొత్తం తెలియజేస్తాం. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, రాష్ట్రపతి అపాయింట్ మెంట్ అడిగాం. ఖరారు కాగానే అందరినీ కలుస్తా. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరతా. తన నియోజకవర్గంలో ఎంపీ మిథున్ రెడ్డి తిరగకూడదా..? పోలీసుల సమక్షంలో రెడ్డప్ప కారు కాల్చేసి ఇంటిపై దాడి చేశారు. లా అండ్ ఆర్డర్ పట్టించుకునే పరిస్థితుల్లో పోలీసులు లేరు. హత్యాచారాలు జరిగినా, హత్యలు జరిగినా పోలీసులు పట్టించుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో ఉండగా టీడీపీ వాళ్ళని కొట్టండి, చంపండి అనలేదు. చంద్రబాబు తప్పుడు మాటలు, వాగ్దానాలు చెప్పి అధికారంలోకి వచ్చారు. మా పాలనలో పథకాలు క్యాలెండర్ పెట్టి మరీ అమలు చేశాం. రెండు క్వార్టర్లలకు విద్యా దీవెన బకాయి ఉంది. అమ్మఒడి, రైతు భరోసా ఈపాటికి ఖాతాల్లో వేసే వాళ్ళం. ఎంతమంది ఉంటే అంతమందికి అమ్మకి వందనం అన్నారు. ఏది మరి..? ఆడపిల్లలకు రూ.1500 ఇస్తాము అన్నారు.. ఇచ్చారా..? 1.80 కోట్ల మంది 1500 కోసం ఎదురు చూస్తున్నారు. ఇవ్వండి. హామీల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ దాడులు చేస్తున్నారు" అని జగన్ ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా వినుకొండలో దారుణ హత్యకు గురైన వైసీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని జగన్ పరామర్శించారు. రషీద్ నివాసానికి వెళ్లిన ఆయన రషీద్ కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు జగన్.

## తిరుమల భక్తుల భద్రతపై హోంమంత్రి అనిత కీలక వ్యాఖ్యలు



**విశ్వంభర, తిరుమల:** మెట్ల దారిలో తిరుమల వెళ్లే భక్తులు సురక్షితంగా చేరుకునేలా చర్యలు చేపడతామని, అడవి జంతువులు దాడి చేయకుండా ఫెస్టింగ్ ఏర్పాటు చేస్తామని ఏపీ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అలిపిరి నడక మార్గం ద్వారా తిరుమలకు చేరుకున్న ఆమె శ్రీవారి మొక్కులు చెల్లించుకున్నారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. నడకదారి భక్తులకు సులభంగా దర్శనం కల్పించేందుకు గతంలో టోకెట్లు ఇచ్చే వారని ఇప్పుడు మళ్లీ ఆ విధానాన్ని తీసుకొచ్చి భక్తులకు టోకెన్లు ఇవ్వాలని సూచించారు. అలిపిరి మార్గంలో వచ్చే భక్తులకు భద్రత కల్పించేందుకు చర్యలు చేపడతామని, అడవి జంతువులు దాడి చేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అడవి జంతువుల నుంచి రక్షించుకునేందుకు భక్తులకు గుతపలు ఇవ్వడం హాస్యాస్పదంగా అనిపిందన్నారు. అలాగే నరసాపురం ఎంపీడీఓ కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయని, ఆయన సురక్షితంగా తిరిగి రావాలని కోరుకున్నారు. సీఎం చంద్రబాబు కూడా ఎంపీడీవో కుటుంబాన్ని కలిశారని, వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే మా ప్రభుత్వంలో ఉద్యోగులపై ఎలాంటి ఒత్తిడి ఉండదని, స్వేచ్ఛగా విధులు నిర్వర్తించేలా ప్రభుత్వం సహకరిస్తుందని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

## రేవంత్ లాగా ఏపీలో రుణమాఫీ చేయండి
### వైఎస్ షర్మిల




**విశ్వంభర, విజయవాడ:** రేవంత్ లాగా ఏపీలో రుణమాఫీ చేయండి అంటూ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. 15 ఏళ్ళ క్రితం, ఒకే దఫాలో దేశవ్యాప్తంగా రుణమాఫీ చేసి అన్నదాత పట్ల ప్రేమ, వ్యవసాయం పట్ల నిబద్ధత చూపింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వం. మళ్ళీ నిన్న తెలంగాణలోని రేవంత్ రెడ్డి సారధ్యంలో, సోనియా, రాహుల్ గాంధీ గారి ఆలోచన, ఆదర్శాలకు అనుగుణంగా, ఇంకెప్పుడు అని వెక్కిరించే నోళ్లు మూస్తూ, కాంగ్రెస్ సర్కారు అందించిన రైతు రుణమాఫీ వరం చరిత్ర గర్వించే రోజు. రైతు కళ్ళల్లో ఆనందం తిరిగి తీసుకువచ్చే క్షణం. ఇది రాహుల్ గాంధీ ఎన్నికల వేళ చేసిన వాగ్దానం సాకారమైన రోజు. తెలంగాణ సర్కారుకు మనస్ఫూర్తిగా నా అభినందనలు అన్నారు. మరి నేడు, ఆంధ్రప్రదేశ్ లోని కూటమి సర్కారును డిమాండ్ చేస్తున్నాం. రైతుల తలసరి అప్పులో, దేశవ్యాప్తంగా మొదటి స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ లో రైతు రుణమాఫీ ఎందుకు చెయ్యరు. సుమారు 2,45,554 రూపాయల రుణం ప్రతి రాష్ట్ర రైతు నెత్తి మీద కత్తిలా వేలాడుతోంది. గడచినా దశాబ్దంలో అటు కరువు, తుఫానులు, ఇటు పూర్తికాని ప్రాజెక్టులు, సర్కారుల నిర్లక్ష్యం, వెరసి రాష్ట్ర వ్యవసాయం సర్వనాశనం అయిపోయిందని ఆగ్రహించారు.. మరి డబుల్ ఇంజిన్ సర్కారు నడుపుతున్న మీరు, కేంద్ర సాయంతో ఎందుకు రుణమాఫీ చేయకూడదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే, రెండు లక్షల రూపాయల రుణమాఫీ, ఇచ్చిన మాట ప్రకారం కచ్చితంగా చేసి ఉండేదని గర్వంగా చెప్పగలము. కూటమి సర్కారును అడుగుతున్నాం, రైతు రుణమాఫీ చేయండి, అన్ని విధాలుగా చితికిపోయిన ఆంధ్ర ప్రదేశ్ రైతులకు చేయూతనివ్వండని కోరారు షర్మిల.

## వైసీపీ ఎంపీ మిధున్ రెడ్డి, మాజీ ఎంపీలపై కేసు



**విశ్వంభర, కడప :** వైసీపీ పార్టీ ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్పలకు బిగ్ షాక్ ఇచ్చారు ఏపీ పోలీసులు. వైసీపీ పార్టీ ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్పలపై కేసులు పెట్టారు పోలీసులు. చిత్తూరు జిల్లా పుంగనూరులో జరిగిన టీడీపీ, వైసీపీ పరస్పర దాడుల్లో పోలీసులు కేసులు నమోదు చేశారు. టీడీపీ నాయకుడు సుహేల్ బాషా ఫిర్యాదు మేరకు హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసు పెట్టారు. ఏ1గా ఎంపీ మిథున్ రెడ్డి, ఏ2గా మాజీ ఎంపీ రెడ్డప్పతో సహా 34 మందిపై కేసు రిజిస్టర్ చేశారు. మరోవైపు రెడ్డప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొమ్మిది మందితో సహా మరి కొందరు టీడీపీ నాయకులపైనా కేసు పెట్టారు. ఇక దీనిపై మిథున్ రెడ్డి మాట్లాడారు. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ డైరెక్షన్ లోనే పుంగనూరు లో దాడులు జరుగుతున్నాయని ఆరోపణలు చేశారు. పుంగనూరు నియోజకవర్గం అభివృద్ధి అడ్డుకోవాలని కుట్రలో భాగమే అన్నారు. 5 వేల కోట్లతో ఎలక్ట్రికల్ కారు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే, దాన్ని రాకుండా కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు.

## ఎడతెరపిలేని వర్షాలు.. అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు



**విశ్వంభర, విజయవాడ:** ఏపీలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో చంద్రబాబు సర్కార్ అలెర్ట్ అయింది. అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు ఇచ్చారు. వర్షాలు అధికంగా ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధికారులతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాలనీ.. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలనీ ఆదేశించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 185 మిల్లీమీటర్లకు గాను 244 మిల్లీమీటర్లు నమోదైందని, రాష్ట్ర వ్యాప్తంగా 31 శాతం అదనంగా వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో చెరువు కట్టలు, వాగుల్లో ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా ఇసుక, మట్టి అక్రమ తవ్వకాల వల్ల గోదావరి కట్టలు బలహీన పడ్డాయనీ.. వాటిపై ప్రత్యేక దృష్టిసారించాలనీ సూచించారు. గత ప్రభుత్వం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలను నాశనం చేసింది. మళ్లీ వాటిని యాక్టివేట్ చేయాలని సీఎం సూచించారు. విపత్తులు వచ్చినప్పుడే అధికారుల పనితీరు, సమర్థత బయటపడుతుంది. ఇలాంటి సమయంలోనే అధికారులు డైనమిక్‌గా పనిచేయాలన్నారు.

## లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు : అవినాశ్ రెడ్డి



**విశ్వంభర, కడప:** కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మా అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల చేతిలో దాడికి గురైన వారిని పరామర్శిస్తున్నామని... సింహాద్రిపురం మండలం లో దాడికి గురైన అబ్బాస్,ప్రతాప్ రెడ్డి వల్లిలను పరామర్శించి మనోధైర్యం ఇచ్చామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడిన నెల రోజుల్లోనే వేల మంది వైకాపా కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు.... లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని నిప్పులు చెరిగారు. నిన్న గుంటూరులో వేల మంది చూస్తుండగా వైకాపా కార్యకర్త రషీద్ పాశవికంగా దాడి చేసి హత్య చేశారని... వేంపల్లె లో అజయ్ రెడ్డి పై హాకీ స్టిక్ లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కేవలం కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారు....సాక్షాత్తు ముఖ్యమంత్రి కొడుకు లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నాం అంటున్నారని ఆగ్రహించారు. గత ఐదేళ్లలో మేము అలా అనుకొని ఉంటే ఈ రోజు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఉండేవారు కాదని... మా నాయకుడు అలాంటివి ప్రోత్సాహించలేదని వివరించారు. పార్టీలు ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాలనే మా నాయకుడు ఆలోచించారు...తెలుగుదేశం పార్టీ ఏర్పడిన వెంటనే పులివెందుల ఇసుక డిపోలో నిల్వ ఉన్న 60 వేల టన్నుల ఇసుక మాయం అయిందన్నారు.

# భారత జట్టులోకి ఆరుగురు కేకేఆర్ ప్లేయర్లు..

**విశ్వంభర, స్పోర్ట్స్ :** శ్రీలంక పర్యటనకు వెళ్లే భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. జులై 27 నుంచి ప్రారంభం కానున్న ఈ టూర్‌లో టీమిండియా 3 మ్యాచ్‌ల టీ20, వన్డే సిరీస్‌లు ఆడనుంది. వన్డే జట్టుకు రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా, సూర్యకుమార్ యాదవ్‌కు టీ20 జట్టు బాధ్యతలు అప్పగించారు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఈ పర్యటనలో చాలా మంది యువ ఆటగాళ్లను అనుమతించారు. కానీ, ఈ పర్యటన కోసం భారత జట్టులో ఆరుగురు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ఆటగాళ్లు ఎంపిక కావడం విశేషం. అంటే గంభీర్ కోచ్ అవ్వగానే కేకేఆర్ ఆటగాళ్ల ఫేట్ మారిపోయింది.



**ఇష్టమైన ఆటగాళ్ల ఎంపిక?**

శ్రీలంక పర్యటనకు బీసీసీఐ రెండు జట్లను ప్రకటించింది. ఒక జట్టు టీ20 సిరీస్ ఆడనుండగా, మరో జట్టు వన్డేల్లో పాల్గొంటుంది. ఈ సిరీస్‌తో భారత జట్టుకు అధికారిక కోచ్‌గా ఉన్న గంభీర్.. ఈ రెండు సిరీస్‌లకు జట్టులో ఆరుగురు కేకేఆర్ ఆటగాళ్లను ఎంపిక చేశాడు. వీరంతా గంభీర్ నాయకత్వంలో లేదా మార్గదర్శకత్వంలో ఒకప్పుడు లేదా మరొక సమయంలో ఐపీఎల్‌లో కేకేఆర్ కోసం ఆడారు.

**ఫామ్‌లో లేని అయ్యర్ ఎంపిక..**

ఇందులో మొదటి పేరు ప్రస్తుత కేకేఆర్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్. అయ్యర్ దాదాపు 8 నెలల పాటు భారత జట్టుకు దూరమయ్యాడు. క్రమశిక్షణ ఉల్లంఘించినందుకు బీసీసీఐ అతనిపై చర్యలు తీసుకుని సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి కూడా తొలగించింది. అయితే గంభీర్ కోచ్‌గా మారిన వెంటనే శ్రేయాస్ అయ్యర్ తిరిగి జట్టులోకి వచ్చాడు. వాస్తవానికి, అయ్యర్‌ను భారత జట్టు నుంచి తప్పించడంతో, బోర్డు అతన్ని రంజీ ఆడమని సూచించింది. ఆ సమయంలో గంభీర్ కూడా బీసీసీఐ సూచనకు అనుకూలంగా జెండా ఊపాడు. కానీ, కోచ్ అయ్యాక గంభీర్.. అయ్యర్ ను జట్టులోకి అనుమతించాడు. అయితే అయ్యర్‌తో పాటు భారత జట్టుకు దూరమైన ఇషాన్ కిషన్‌ను అనుమతించే పనిని గంభీర్ చేయలేదు.

**నాయకుడిగా సూర్య..**

ఈ జాబితాలో రెండవ అతిపెద్ద పేరు సూర్యకుమార్ యాదవ్. సూర్య గతంలో కూడా కేకేఆర్ కోసం ఆడాడు. అంతే కాదు, గంభీర్ కేకేఆర్ కోసం ఆడుతున్నప్పుడు తన కెప్టెన్సీలో సూర్యను వైస్ కెప్టెన్‌గా చేశాడు. ఇప్పుడు టీమ్ ఇండియా కోచ్ అయ్యాక టీ20 టీమ్ కెప్టెన్సీకి అతిపెద్ద పోటీదారుగా ఉన్న హార్దిక్ పాండ్యాను పక్కన పెట్టి సూర్యను జట్టుకు కెప్టెన్‌గా చేశాడు.

**మిగతా వారి జాబితా..**

సూర్యకుమార్ యాదవ్, శ్రేయాస్ అయ్యర్‌లతో పాటు రింకూ సింగ్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, శుభ్‌మన్ గిల్ కూడా కేకేఆర్ తరపున ఆడారు. శుభ్‌మన్ గిల్ వన్డేలు, టీ20ల్లో వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. జట్టు వైస్ కెప్టెన్‌గా చేసినప్పటికీ గిల్‌కు నాయకత్వ అనుభవం లేదు. అయితే గిల్ కంటే ఎక్కువ నాయకత్వ అనుభవం ఉన్న కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యాలను ఈ స్థానానికి పరిగణనలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యకరం. గత ఎడిషన్‌లో కేకేఆర్ తరపున బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన హర్షిత్ రాణా వన్డే జట్టుకు ఎంపికయ్యాడు. కానీ, జింబాబ్వే పర్యటనలో అద్భుత ప్రదర్శన చేసిన ముఖేష్ కుమార్, అవేశ్ ఖాన్‌లు జట్టుకు దూరమయ్యారు. దీంతో పాటు అభిషేక్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్‌లను కూడా టీ20 జట్టుకు ఎంపిక చేయలేదు.



## తొలి మ్యాచ్‌లో సత్తా చాటిన భారత మహిళలు.. చిత్తుగా ఓడిన పాక్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** మహిళల ఆసియా కప్‌లో భారత మహిళల జట్టు బోణీ కొట్టింది. చిరకాల ప్రత్యర్థి పాక్ జట్టును ఓడించి సత్తా చాటింది. పాక్ జట్టుపై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ పాక్ జట్టు కేవలం 108 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లు అద్భుతమైన బౌలింగ్‌తో పాక్ జట్టును లో స్కోరింగ్‌కే కట్టడి చేయడంలో సఫలం అయ్యారు. దీప్తి శర్మ 3 వికెట్లు తీయగా, పూజా వస్త్రాకర్, రేణుకా సింగ్ చెరో 2 వికెట్లు తీశారు. పాకిస్థాన్ తరఫున సిద్రా అమీన్ 25, తుబా హసన్, ఫాతిమా సనా తలో 22 పరుగులు చేశారు.అనంతరం ఛేజింగ్ మొదలు పెట్టిన భారత జట్టు కేవలం 14.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి టార్గెట్ చేరుకుంది. షఫాలీ వర్మ 40, మంధాన 45 పరుగులతో రాణించారు. ఈ విజయంతో భారత జట్టు ఖాతాలో 2 పాయింట్లు చేరాయి.మహిళల టీ20 ఆసియా కప్ జులై 19 నుంచి జులై 28 వరకు జరగనుంది. ఇందులో 8 జట్లు పాల్గొంటున్నాయి. వీటిలో భారత్, పాకిస్థాన్, నేపాల్, యూఏఈ, మలేషియా, థాయ్‌లాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు చెందిన మహిళా జట్లు ఉన్నాయి.

**భారత మహిళల జట్టు ప్రాబబుల్ ప్లేయింగ్ 11:**

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, రిచా ఘోష్, డి. హేమలత, శ్రేయాంక పాటిల్, రేణుకా సింగ్, జెమిమీ రోజర్స్, షెఫాలీ వర్మ, దీప్తి శర్మ, పూజా వస్త్రాకర్, రాధా యాదవ్.

**పాకిస్థాన్ మహిళల జట్టు ప్రాబబుల్ ప్లేయింగ్ 11**

నిదా దార్ (కెప్టెన్), ఇలియా రియాజ్, తుబా హసన్, ఫాతిమా సనా, గుల్ ఫిరోజ్, ఇరామ్ జావేద్, సిద్రా అమీన్, నస్రా సంధు, సయ్యదా అరుబ్ షా, మునిబా అలీ, సాదియా ఇక్బాల్.

## విడాకుల ప్రకటన తరువాత.. హార్దిక్ పాండ్యా భార్య తొలి పోస్ట్



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమ్‌ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, నటాషా స్టాంకోవిచ్‌ల వైవాహిక బంధానికి తెరపడింది. తాము విడాకులు తీసుకోనున్నట్లుగా గురువారం రాత్రి సోషల్ మీడియా వేదికగా హార్దిక్, నటాషాలు ప్రకటించారు. కాగా.. గత కొంతకాలంగా వీరిద్దరు విడిపోనున్నారనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే.ఈ క్రమంలోనే బుధవారం తెల్లవారుజామున నటాషా తన కుమారుడు అగస్త్యతో కలిసి ముంబై నుంచి సెర్బియాకు వెళ్లింది. వీరిద్దరూ ముంబై విమానాశ్రయం నుంచి వెలుతున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా.. విడాకుల ప్రకటన తరువాత స్టాంకోవిచ్ తన సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలను, వీడియోను పోస్ట్ చేసింది. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో నటాసా పోస్ట్ చేసిన వీటిలో ఆమె తన కుమారుడితో సమయం గడుపుతున్నట్లుగా అర్థమవుతోంది. ఒక ఫోటోలో ఆమె తన కొడుకు నిద్రపోతున్నప్పుడు అతనిని తన చేతుల్లోకి తీసుకువెళ్లడం చూడవచ్చు. వీడియోలో.. అగస్త్య మొక్కల దగ్గర తోట ప్రాంతంలో బంతిని పట్టుకుని కనిపించాడు. మరో ఫోటోలో అగస్త్య సోఫాలో తెల్లటి లాబ్రడార్‌తో విశ్రాంతి తీసుకుంటున్నాడు. 2019 డిసెంబర్ 31న సెర్బియా నటి అయిన నటాషా స్టాంకోవిచ్‌కు హార్దిక్ పాండ్య ఉంగరం తొడిగి తన ప్రేమను తెలియజేసి ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. 2020 లాక్‌డౌన్ సమయంలో వీరు వివాహం చేసుకున్నారు. అదే ఏడాది జూన్‌లో వీరికి అగస్త్య జన్మించాడు. గతేడాది వీరిద్దరూ మరోసారి వివాహం చేసుకున్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో హిందూ, క్రిస్టియన్ పద్ధతుల్లో పెళ్లి చేసుకున్నారు.

## టీమిండియా ఫ్యూచర్ అన్నారు.. కట్‌చేస్తే జట్టులో చోటుకోసం పడిగాపులు

**విశ్వంభర, స్పోర్ట్స్ :** శ్రీలంకతో టీ20, ఓడీఐ సిరీస్‌లకు భారత జట్టును ప్రకటించారు. మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ శ్రేయాస్ అయ్యర్ మళ్లీ టీమిండియాలోకి వచ్చాడు. వన్డే ఫార్మాట్‌కు ఎంపికయ్యాడు. గతేడాది ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అయ్యర్‌ను జట్టు నుంచి తప్పించారు. దేశవాళీ క్రికెట్‌కు దూరం పాటించినందుకు అతడిపై చర్యలు తీసుకున్నారు. ఆయనకు సెంట్రల్ కాంట్రాక్టు కూడా ఇవ్వలేదు. వికెట్ కీపర్ కం బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్ విషయంలో కూడా అలాంటిదే జరిగింది. అయ్యర్ ఓడీఐ జట్టులోకి తిరిగి వచ్చినప్పటికీ, కిషన్‌ను మళ్లీ పట్టించుకోలేదు.



**8 నెలల పాటు భారత్ తరపున ఆడని ఇషాన్..**

గౌతమ్ గంభీర్ కోచ్‌గా మారిన వెంటనే శ్రేయాస్ అయ్యర్‌కి మంచి రోజులు వచ్చాయి. తన కెప్టెన్సీలో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఈ ఏడాది ఐపీఎల్‌ని గెలిపించాడు. మరోవైపు, ఇషాన్ కిషన్ విషయంలో మాత్రం వేరేలా జరుగుతోంది. సెలక్టర్ల రాడార్‌లో అతను ఎక్కడా లేడని తెలుస్తోంది. ఇషాన్ చివరిసారిగా నవంబర్ 2023లో భారత్ తరపున ఆడాడు. గౌహతిలో ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 మ్యాచ్‌ల్లో పాల్గొన్నాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో అలసట కారణంగా ఇషాన్ విరామం కోరాడు. ఆ తర్వాత దేశవాళీ క్రికెట్‌కు కూడా దూరంగా ఉన్నాడు. ఈ సమయంలో, కిషన్ బరోడాలో హార్దిక్ పాండ్యాతో శిక్షణ పొందాడు. అతని కెప్టెన్సీలో ముంబై ఇండియన్స్ కోసం ఆడటానికి వచ్చాడు. ఇప్పుడు వచ్చే దేశవాళీ సీజన్ తర్వాతే కిషన్ తిరిగి వచ్చే అవకాశం పెరిగింది. ఐపీఎల్‌లో మాత్రమే ఆడడం అతనికి హానికరమని ఇప్పటికే అర్థమైంది.

**దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యత..**

రాబోయే దేశవాళీ క్రికెట్ సీజన్ 2024-25లో ఆటగాళ్ల లభ్యత, భాగస్వామ్యాన్ని బోర్డు పర్యవేక్షిస్తూనే ఉంటుందని బీసీసీఐ మీడియా ప్రకటనలో తెలిపింది. గత ఏడాది విజయ్ హజారే ట్రోఫీలో ఏడు అర్ధ సెంచరీలు సాధించిన అసోం ఆటగాడు రియాన్ పరాగ్ అద్భుత ప్రదర్శనతో లాభపడ్డాడు. దేశవాళీ క్రికెట్ ప్రదర్శనకు జాతీయ సెలక్షన్ కమిటీ పూర్తి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఇషాన్ కిషన్ మళ్లీ తానేంటో నిరూపించుకోవాల్సి ఉంది.

## ఆండ్రూ ఫ్లింటాఫ్ కొడుకు మామూలోడు కాదుగా..



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఇంగ్లాండ్ దిగ్గజ ఆల్‌రౌండర్ ఆండ్రూ ఫ్లింటాఫ్ కొడుకు రాకీ ఫ్లింటాఫ్ చరిత్ర సృష్టించాడు. ఇంగ్లాండ్ అండర్ 19 క్రికెట్‌లో సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడిగా రికార్డులకు ఎక్కాడు. చెల్టెన్‌హామ్ వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో రాకీ ఈ రికార్డును అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 181 బంతులు ఎదుర్కొన్న రాకీ 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 106 పరుగులు చేశాడు. కాగా.. రాకీ సెంచరీ చేసిన సమయంలో అతడి తండ్రీ ఆండ్రూ ఫ్లింటాఫ్ స్టాండ్స్‌లోనే ఉన్నాడు. రాకీ ఫ్లింటాఫ్ అద్భుత సెంచరీతో పాటు కెప్టెన్ హంజా షేక్ (107) శతకంతో చెలరేగడంతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 477 పరుగులు చేసింది. అంతకముందు శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 153 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఇంగ్లాండ్‌కు 324 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో లంక పోరాడుతోంది. మూడో రోజు లంచ్ విరామానికి ఏడు వికెట్లు కోల్పోయి 246 పరుగులు చేసింది.

**యువ ఫ్లింటాఫ్కు ఉజ్వల భవిష్యత్తు?**

ఈ మ్యాచ్‌లో రాకీ ఫ్లింటాఫ్ ఆడిన విధానం చూస్తుంటే అతడు త్వరలోనే జాతీయ జట్టు తరుపున ఆడే అవకాశాలు ఉన్నాయి. అతడు తన వయసుకు మించి పరిణితిని ప్రదర్శించాడు. కేవలం హిట్టింగ్‌కే ప్రాధాన్యం ఇవ్వకుండా పరిస్థితులకు తగ్గట్లుగా సమయోచితంగా బ్యాటింగ్ చేశాడు. జాక్ కార్నీతో ఆరో వికెట్‌కు 78 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.

## భారీ నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

**విశ్వంభర, బిజినెస్:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూలతలు, మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం తదితర కారణాలతో సూచీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ ఒక్క రోజే ఏకంగా రూ. 8 లక్షల కోట్ల సంపద ఆవిరయింది. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 738 పాయింట్లు కోల్పోయి 80,604కి దిగజారింది. నిఫ్టీ 269 పాయింట్లు నష్టపోయి 24,530 వద్ద స్థిరపడింది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:**

ఇన్ఫోసిస్ (1.92%), ఐటీసీ (0.89%), ఏసియన్ పెయింట్ (0.53%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ (0.03%).

**టాప్ లూజర్స్:**

టాటా స్టీల్ (5.17%), జేఎస్ డబ్ల్యూ స్టీల్ (4.36%), ఎన్టీపీసీ (3.51%), టాటా మోటార్స్ (3.43%), అల్ట్రాటెక్ సిమెంట్ (3.28%).



## లోన్ కట్టమని రికవరీ ఏజెంట్స్ వేధిస్తున్నారా?

**విశ్వంభర, బిజినెస్:**

ఇటీవల కాలంలో పెరిగిన ఖర్చులు, అవసరాల నేపథ్యంలో రుణం తీసుకోవడం అనేది తప్పనిసరిగా మారింది. చాలా మంది ముందుగా వచ్చిన ఖర్చు నుంచి తప్పించుకోవడానికి అందుబాటులో ఉన్న రుణం తీసుకుంటూ ఉంటారు. అయితే దాన్ని కట్టడం నిర్లక్ష్యం చూపుతూ ఉంటారు. అయితే ఈ నేపథ్యంలో లోన్ రికవరీ చేసేందుకు ఆయా బ్యాంకులు లోన్ రికవరీ ఏజెంట్లను లోన్ తీసుకున్న వ్యక్తి వద్దకు పంపిస్తాయి. కానీ లోన్ రికవరీ చేసేందుకు వాళ్లు చేసే ప్రయత్నాలు సగటు రుణగ్రహీతను ఇబ్బంది పెడతాయి. అయితే సాధారణంగా లోన్ రికవరీ ఏజెంట్లు రుణగ్రహీతలను వేధిస్తున్నారని తరచూ మనం మీడియాలో చూస్తూ ఉంటాం. అయితే రుణ ఎగవేత విషయంలో రుణగ్రహీతలకు కూడా చట్టపరమైన హక్కులు ఉంటాయని చాలా మందికి తెలియదు. ప్రస్తుతం బ్యాంకులు మరియు నాన్‌బ్యాంకు రుణదాతలు తమ కస్టమర్ బేస్‌ను విస్తృతం చేసుకునేందుకు రుణాన్ని చాలా ఈజీగా అందిస్తున్నాయి. అయితే పెరుగుతున్న రుణాల నేపథ్యంలో నేపథ్యంలో ఆర్‌బీఐ కూడా రుణ నిబంధనలను కూడా సడలించింది. ఈ నేపథ్యంలో రుణం చెల్లించే విషయంలో రుణగ్రహీతలకు ఉండే చట్టపరమైన హక్కుల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి..?**

గత కొంత కాలంలో రుణాల సులభంగా లభిస్తుండడంతో డిఫాల్ట్‌ల కూడా సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో రుణ వసూలుకు సంబంధించి కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. అయితే రుణ ఎగవేతదారులను ఆర్థిక సంస్థల అనవసరమైన వేధింపులు, దుర్వినియోగ ప్రవర్తన నుంచి రక్షించడానికి రిజర్వ్ బ్యాంక్ వివిధ చట్టపరమైన హక్కులను అందించింది. ఒక రుణగ్రహీత డిఫాల్టర్‌గా మారడం వల్ల ఉద్యోగ నష్టం లేదా ఇతర ఆర్థిక సమస్యల కారణమై ఉండవచ్చు. ఆర్‌బీఐ వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి వేధింపుల సంఘటనలను నివారించడానికి మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రత్యేకించి కోవిడ్ అనంతర ఆర్థిక సంస్థలు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. రుణాలను రికవరీ చేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు రికవరీ ఏజెంట్లు కస్టమర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కస్టమర్లకు ఉన్న చట్టపరమైన హక్కుల నిపుణులు సూచనలను చూద్దాం.



**రుణగ్రహీతలు ఈ సూచనలు మరిచిపోవద్దు**

వేధింపుల రుజువును చూపడానికి రికవరీ ఏజెంట్ నుంచి వచ్చే అన్ని కాల్‌లు, ఇమెయిల్‌లు, మెసేజ్‌లను రికార్డ్ చేయాలి. ఈ సాక్ష్యాన్ని మీ రుణ అధికారికి లేదా రుణదాతకు సమర్పించాలి. వేధింపులు కొనసాగితే అన్ని వివరాలతో ఆర్‌బీఐకు మెయిల్ చేయడం ఉత్తమం. రుణాలు, అడ్వాన్సుల కోసం ఆర్‌బీఐకు సంబంధించిన సర్క్యులర్ మార్గదర్శక ఉల్లంఘనలు, రికవరీ ఏజెంట్ల వేధింపుల గురించి ఫిర్యాదులను కచ్చితంగా పరిష్కరిస్తుంది. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో రికవరీ ఏజెంట్లను ఉపయోగించకుండా బ్యాంకులను ఆర్‌బీఐ నిషేధించే అవకాశం ఉంది. పదేపదే ఉల్లంఘనలకు పాల్పడితే ఆర్‌బీఐ ఆ బ్యాంకులపై నిషేధాన్ని పొడిగించవచ్చు. రికవరీ ఏజెంట్ స్నేహితులు, కుటుంబ సభ్యులను సంప్రదించడం ద్వారా లేదా మీ కార్యాలయంలో లేదా పరిసరాల్లో ఇబ్బందులకు గురిచేస్తే మీరు బ్యాంక్, ఏజెంట్‌పై పరువు నష్టం దావా వేయవచ్చు. రికవరీ ఏజెంట్లు అనుమతి లేకుండా మీ ఆస్తిలోకి ప్రవేశిస్తే మీరు కోర్టును కూడా ఆశ్రయించవచ్చు. మరింత కఠినమైన చర్యలు తీసుకునే ముందు మీ మొదటిగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయాలి. పోలీసులు సహాయం చేయకపోతే లేదా మీ ఫిర్యాదును నమోదు చేయకపోతే మీరు కోర్టు ఆశ్రయించాల్సి ఉంటుంది.

## గ్లామర్ డోస్‌తో హీటెక్కిస్తోన్న
# ఐశ్వర్య రాజేష్

విశ్వంభర, సినిమా: ఐశ్వర్య రాజేష్.. కానీ కోలీవుడ్ ఇండస్ట్రీలో వరుస అవకాశాలు అందుకుంటుంది. తమిళ సినీ పరిశ్రమలో ఈ బ్యూటీ బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ సినిమాలతో దూసుకుపోతుంది. ప్రస్తుతం తమిళ సినిమా పరిశ్రమలో రాణిస్తోంది. ఫీమేల్ ఓరియేంటెడ్ చిత్రాలకు ఐశ్వర్య రాజేష్ కేరాఫ్ అడ్రస్. హీరోయిన్ పాత్రలే కాకుండా విభిన్న కంటెంటే.. వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇటు తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. ఇన్నాళ్లు సినిమాల్లో పద్ధతిగా కనిపించిన ఈ బ్యూటీ.. ఇప్పుడు గ్లామర్ డోస్ పెంచేసింది. మోడ్రన్ డ్రెస్సులో ఐశ్వర్య చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరలవుతుంది. ఐశ్వర్య లేటేస్ట్ లుక్స్ చూసి ఆశ్చర్యపోతున్నారు నెటిజన్స్. కౌసల్య కృష్ణమూర్తి సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యింది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ సరసన వరల్డ్ ఫేమస్ లవర్ సినిమాలో మెరిసింది. ఈ మూవీలో సహజ నటనతో కట్టిపడేసింది. ఎప్పుడూ సంప్రదాయబద్ధంగా కనిపించే ఐశ్వర్య ఇప్పుడు మాత్రం గ్లామర్ డోస్ పెంచేసి మోడ్రన్ డ్రెస్సులో మైండ్ బ్లాంక్ చేస్తుంది. తాజాగా ఐశ్వర్య లుక్స్ పై క్రేజీగా కామెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్.






## డైరెక్టర్ పూరి జగన్నాథ్ పై పోలీస్ కేసు నమోదు

**విశ్వంభర, సినిమా :** మేడిపల్లి పోలీస్ స్టేషన్లో డైరెక్టర్ పూరి జగన్నాథ్ పైయ పోలీసులు కేసు నమోదు చేశారు. డబుల్ ఇస్మార్ట్ సినిమా వివాదంపై బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు ఫిర్యాదు చేశారు. రామ్ పోతినేని హీరోగా డైరెక్టర్ పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో ఇస్మార్ట్ శంకర్ సినిమాకు సీక్వెల్ గా డబుల్ ఇస్మార్ట్ అనే సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. కాగా ఈ సినిమా నుంచి మంగళవారం మార్ ముంతా.. ఛోడ్ చింతా అనే లిరికల్ సాంగ్‌ను చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. కాగా పాట కొద్ది క్షణాల్లోని తెలుగు ప్రేక్షకులకు మరీ ముఖ్యంగా తెలంగాణ ప్రాంత వాసులకు విపరీతంగా నచ్చేసింది. మాస్ స్టేప్పులతో రామ్ అలరించాడు. అయితే ఈ పాటలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ డైలాగ్ పెట్టడంతో బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. గతంలో కేసీఆర్ ఓ ప్రెస్ మీట్‌లో 'ఏం జేద్దమంటవు మరి..' అని విలేకర్లతో అన్న వాయిస్ ను ఐటం సాంగులో ఎలా వాడతరంటూ.. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తప్పుబడుతున్నాయి. వెంటనే పాటలో ఉన్న కేసీఆర్ డైలాగ్ ను తొలగించాలని లేదంటే.. మూవీ రిలీజ్ కాకుండా ఆపుతామని హెచ్చరికలు జారీ చేశారు.

## అప్పుడేమో రౌడీ బేబీ.. ఇప్పుడేమో వయ్యారాల నాటీ

**విశ్వంభర, సినిమా:** ఫోటోలోని హీరోయిన్ ఎవరో గుర్తుపట్టారా.? ఈమె తెలుగులో చేసింది తక్కువ సినిమాలే. కానీ ఒక్క వెబ్ సిరీస్‌తో ఓవర్‌నైట్ స్టార్ అయిపోయింది. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి.. ఒక్కో మెట్టు ఎక్కుతూ.. హీరోయిన్ స్థాయికి ఎదిగింది ఈ అందాల భామ. గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు.. విలనీ క్యారెక్టర్లు కూడా చేసి తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇంతకీ ఆమె ఎవరో కనిపెట్టారా.? లేదంటే..! మీకో క్లూ ఇస్తున్నాం.. ఆకాష్ పూరి హీరోగా వచ్చిన 'రొమాంటిక్' సినిమాలో ఈమే ఓ కీలక రోల్‌లో కనిపించింది. ఎస్.! మీరు గెస్ చేసింది కరెక్టే.. ఆమె మరెవరో కాదు.. దేవియాని శర్మ. 'భానుమతి రామకృష్ణ' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చింది దేవియాని. ఆ సినిమా పెద్దగా ఆకట్టుకోకపోయినా ఈ అమ్మడు అందరి దృష్టి ఆకర్షించింది. అనంతరం 'అనగనగ' అనే టీవీ సిరీస్ చేసింది ఈ బ్యూటీ. ఆ తర్వాత రొమాంటిక్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ద్వారా సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన ఈ భామ. ఆ తర్వాత దర్శకుడు పూరి జగన్నాథ్ తీసిన 'రొమాంటిక్' చిత్రంలో కీలక పాత్ర పోషించి.. మంచి పేరు తెచ్చుకుంది. ఇక 'సేవ్ ది టైగర్స్', 'షైతాన్' అనే వెబ్ సిరీస్‌లతో దేవియానీ శర్మ ఫేం విపరీతంగా పెరిగింది. ఈ రెండు వెబ్ సిరీస్‌ల్లో ఆమె



నటనకుగానూ మంచి మార్కులు పడ్డాయి. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే దేవియానీ శర్మ.. తరచూ గ్లామరస్ ఫోటోలతో ఫ్యాన్స్‌కు సెగలు రేపుతోంది. అటు పద్ధతిగా చీరకట్టులో.. ఇటు బికినీలో హాట్ పోజులిస్తూ.. ఇన్‌స్టాలో ఫైర్ పుట్టిస్తోంది ఈ చిన్నది. ప్రస్తుతం ఈమె ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. లేట్ ఎందుకు మీరూ ఓసారి లుక్కేయండి.

## 'యావరేజ్ స్టూడెంట్ నాని' మూవీ నుంచి సాంగ్ రిలీజ్




**విశ్వంభర, సినిమా:** మెరిసే మెరిసే సినిమాతో దర్శకుడిగా పరిచయమైన పవన్ కుమార్ ఇప్పుడు హీరోగా మారి 'యావరేజ్ స్టూడెంట్ నాని' అనే సినిమాతో రాబోతున్నాడు. సాహిబా భాసిన్, స్నేహ మాల్వియ, వివియా సంత్‌లు హీరోయిన్లుగా, ఝాన్సీ, రాజీవ్ కనకాల ముఖ్య పాత్రల్లో పవన్ కుమార్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తూ ఈ సినిమాని తెరకెక్కిస్తున్నాడు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై ఈ సినిమాని తనే నిర్మించడం విశేషం. 'యావరేజ్ స్టూడెంట్ నాని' సినిమాని యూత్‌ఫుల్ లవ్, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తుండగా ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్, మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేయగా తాజాగా ఓ రొమాంటిక్ మెలోడీ సాంగ్ ని విడుదల చేసారు. సారా సారా.. అంటూ సాగే ఈ పాటను శివకృష్ణచారి ఎర్రోజు రాయగా కార్తిక్ సంగీత దర్శకత్వంలో పద్మలత, అనుదీప్ దేవ్ పాడారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది.

## పుష్ప 2 రూమర్స్ పై స్పందించిన నిర్మాత బన్నీ వాసు

**విశ్వంభర, సినిమా:** టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ సినిమా పుష్ప 2. పాన్ ఇండియా మూవీ లవర్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా ఈ ఏడాది చివర్లో విడుదల కానున్న సంగతి తెలిసిందే. స్టైలీష్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ సుకుమార్ కాంబోలో వస్తున్న ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమాపై కొన్ని రూమర్స్ సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నారు. డైరెక్టర్ సుకుమార్, హీరో బన్నీ మధ్య మనస్పర్థలు వచ్చాయని.. దీంతో వీరిద్దరి మధ్య గ్యాప్ రావడంతో సినిమా షూటింగ్ ఆలస్యమవుతుందని పలు రకాలుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. ఇక ఇటీవలే తన ఫ్యామిలీతో కలిసి బన్నీ వెకేషన్ వెళ్లారు. ఆ సమయంలో అల్లు అర్జున్ గడ్డం ట్రిమ్ చేసి కనిపించడంతో డైరెక్టర్, హీరోకు మధ్య గ్యాప్ వచ్చిందనే రూమర్స్ కు మరింత బలం చేకూరింది. తాజాగా పుష్ప 2 రూమర్స్ పై ప్రొడ్యూసర్ బన్నీవాస్ స్పందించారు. తాజాగా ఆయ్ సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న ఆయనకు పుష్ప 2కు సంబంధించిన ప్రశ్నలు ఎదురయ్యాయి. పుష్ప 2పై మీడియాలో





వస్తున్న వార్తలు చూస్తే నవ్వు వస్తోందని అన్నారు. అల్లు అర్జున్, సుకుమార్ అలాగే తన బాండింగ్ జీవితాంతం ఉంటుందని అన్నారు. ""పుష్ప2 గురించి మీడియాలో వస్తున్న న్యూస్ లు చూసి నవ్వుకునే స్థితిలో మేమున్నాం. అల్లు అర్జున్ షూటింగ్ పార్ట్ 15 నుంచి 20రోజుల లోపు ఉంది. ఇది కాకుండా వేరే ఆర్టిస్టులతో కూడా చిత్రీకరణ మిగిలి ఉంది. దర్శకుడు సుకుమార్ ఎడిటింగ్ చూసుకుని ఇంకా ఏమైనా అల్లు అర్జున్ పార్ట్ బ్యాలెన్స్ వుందేమో క్లారిటీ తెచ్చుకుని షూటింగ్ పెట్టుకుందాం అన్నారు. అల్లు అర్జున్ కూడా దీన్ని దృష్టిలో పెట్టుకొని ట్రీమ్ చేశారు. అల్లు అర్జున్ సుకుమార్‌కు నాకు ఉన్న బాండింగ్ లైఫ్ లాంగ్ అలానే వుంటుంది. ఆగష్టు మొదటి వారంలో షూటింగ్ మొదలవుతుంది పుష్ప లాంటి పాన్ ఇండియా క్రేజీ ఫిలింని సింపుల్ గా ఎందుకు తీసుకుంటారు" అని అన్నారు. దీంతో పుష్ప 2 వస్తోన్న రూమర్స్ పై స్పష్టత వచ్చింది.

## వర్షా కాలంలో ఆస్తమా, సీఓపీడీ పేషెంట్స్
# తీసుకోవాల్సిన జాగ్రత్తలు

**విశ్వంభర, ఫీచర్ :** వర్షాకాలం వచ్చేసింది. ఈ కాలంలో చాలా రోగాలు రావడం కామన్. ముఖ్యంగా అనేక రకాల వైరల్ ఇన్ఫెక్షన్స్ ఈ కాలంలో ఎక్కువగా వస్తాయి. కాబట్టి ఖచ్చితంగా ఈ వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. వర్షాకాలంలో పెరిగిన తేమ, చల్లటి వాతావరణం కారణంగా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు, ముఖ్యంగా ఆస్తమా ఇంకా సీఓపీడీ (క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) ఉన్నవారికి అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉంది.ఈ వానా కాలంలో పలువురు ఆరోగ్య నిపుణులు ఆరోగ్యంగా ఉండేందుకు సలహాలు ఇస్తున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. డాగురుగ్రామ్‌లోని మణిపాల్ హాస్పిటల్‌లో పల్మోనాలజీ కన్సల్టెంట్ పియూష్ గోయెల్ ఒకరు. ఈయన వర్షాకాలంలో శ్వాసకోశ సమస్యలు ఇంకా అలెర్జీల పెరుగుదలను గుర్తించారు.వానాకాలంలో సంభవించే వైరల్ ఇన్ఫెక్షన్ల పెరుగుదల దాని వెనుక అత్యంత ముఖ్యమైన మరియు అత్యంత సాధారణ కారణం. మరియు దాని కారణంగా, రోగులలో స్థిరంగా ఉండే ఉబ్బసం ఇంకా సీఓపీడీ తీవ్రమవుతున్నాయని ఆయన వివరించారు. సీఓపీడీ రోగులు తరచుగా ఈ వైరల్ ఇన్ఫెక్షన్ల కారణంగా ఊపిరి పీల్చుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యలను తగ్గించడానికి, డాక్టర్ గోయెల్ చేతుల



పరిశుభ్రతగా ఉంచుకొని ఫేస్ మాస్క్‌లను ఉపయోగించడం ముఖ్యమని చెప్పారు. చేతి పరిశుభ్రత చాలా ముఖ్యం, తద్వారా మీ చేతుల ద్వారా మీకు ఎటువంటి ఇన్ఫెక్షన్ రాకుండా ఉంటుంది. మీరు అలెర్జీ లేదా సీఓపీడీ రోగి అయినట్లయితే మీరు ఖచ్చితంగా ముఖానికి మాస్క్ ధరించాలి. అందువల్ల మీరు మీ చేతులను మీ నోటిలోకి రాకుండా నివారించవచ్చు. అప్పుడు మీరు గాలి నుండి నేరుగా అలెర్జీ కారకాలను పొందలేరు. మీరు ఫేస్ మాస్క్‌ను ధరించినట్లయితే వైరల్ ఇన్ఫెక్షన్ బారిన పడకుండా ఉంటారని ఆయన సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా ధూమపానం మానేయాలని చెబుతున్నారు. ఇంకా తాజా పండ్లు ఇంకా కూరగాయలు తీసుకోవాలని సలహా ఇస్తున్నారు. ఇవి తింటే రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుంది.కాబట్టి ఖచ్చితంగా వర్షాకాలంలో ఈ జాగ్రత్తలు పాటించండి.

## వణుకు పుట్టిస్తోన్న చండీపురా వైరస్..

- చిన్నారులపై తీవ్ర ప్రభావం
- మెదడువాపుతో ప్రాణాలకు డేంజర్
- ఈగలు, దోమలతోనే వైరస్ వ్యాప్తి

**విశ్వంభర, ఫీచర్:** గత మూడు సంవత్సరాల క్రితం కరోనా వైరస్ ప్రపంచాన్ని మొత్తం అతలాకుతులం చేసింది. ఈ వైరస్ కారణంగా లక్షల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయాయి. అయితే ఈ భయంకరమైన మహమ్మారి నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్న తరుణంలోనే మరో కొత్త వైరస్ వ్యాప్తి చెంది అందరిని భయాందోళనలకు గురిచేస్తుంది. గుజరాత్‌లో చండీపురా అనే కొత్త వైరస్ వెలుగులోకి వచ్చింది. ఈ వైరస్ చిన్నపిల్లలపై తీవ్రమైన ప్రభావం చూపడంతో 2 రోజుల వ్యవధిలోనే ఐదుగురు పిల్లలు మరణించినట్టు వైద్యులు ప్రకటించారు. వైద్యులు సమాచారం ప్రకారం ఈ వైరస్ మొదట జ్వరానికి కారణమవుతుందని తెలిపారు. ఇక ఈ వైరస్ ఈగలు దోమలు వంటి కీటకాల ద్వారా వ్యాప్తి చెందుతుందని వైద్యులు వెల్లడించారు.

**పిల్లల మెదడుపై తీవ్ర ప్రభావం**

ఈ వ్యాధి వ్యాప్తి చెందిన పిల్లల మెదడుపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది మెదడు మొత్తం వాపు రావడమే కాకుండా రోజు రోజుకు వారి పరిస్థితి మరింత క్షీణించి పోతుందని తెలిపారు. ఇలా ఈ వైరస్ వ్యాప్తి చెందితే తీవ్రమైనటువంటి జ్వరం తలనొప్పి వంటి లక్షణాలు కనబడతాయి. అయితే ఈ వైరస్ 1966వ సంవత్సరం మహారాష్ట్ర నాగపూర్ లో చండీపూర్ అనే గ్రామంలో మొదటిసారి బయటపడింది. 15 సంవత్సరాల లోపు వయసు ఉన్నటువంటి పిల్లలు ఈ వైరస్ బారిన పడి చనిపోవడంతో ఈ వైరస్ కి చండీపూర్ అనే పేరు వచ్చింది.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com